
# కర్మల సవరణ గురించి విలువైన ఉపదేశములు




హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారి ఖుత్బా జుమాల ఆధారముగా


ప్రచురణ

నజారత్ నష్రో ఇషాఅత్ సద్ర్ అన్జుమన్ అహ్మదియ్య ఖాదియాన్

بسم الله الرحمن الرحيم

# కర్మల సవరణ గురించి విలువైన ఉపదేశములు

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్**

**అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్**

**అజీజ్ ఖుత్బా జుమాల ఆధారముగా**

✡

**కూర్పు**

నజారత్ ఇస్లాహ్ వ ఇర్షాద్ ఖాదియాన్

✡

**అనువాదము**

హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్

✡

**ప్రచురణ**

నజారత్ నష్రో ఇషాఅత్

సదర్ అన్జుమన్ అహ్మదియ్య ఖాదియాన్

Karmala Sawarana Gurinchi Viluvina Upadeshamulu
(Islahe Amal ke Mutalliq Zarren Nasaih)
(Hadhrat Khalifatul Masih V)
Urdu

Telugu Translation
Hafiz Syed Rasool Niyaz

First Edition : 2015

Copies : 1000

Printed at : Fazl-e-Umar Printing Press Qadian

Published by : Nazarat Nashr-o-Isha'at,
Sadr Anjuman Ahmadiyya Qadian
Dist: Gurdaspur, Punjab, India,143516

ISBN : 978-9383882-45-8

ఇతర వివరాలకు సంప్రదించగలరు

www.alislam.org
www.ahmadiyyamuslimjamaat.in
Toll Free No: 1800-3010-2131

# విషయ సూచిక


| క్ర.సం | శీర్షికలు | పుట |
|---|---|---|
| 1. | ప్రార్థనపు నిజమైన భావము | 6 |
| 2. | హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి సత్యము, నిజాయితి ఉదాహరణలు | 9 |
| 3. | ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గౌరవనీయ అనుచరుల త్యాగము | 12 |
| 4. | హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అనుచరుల సత్యము, నిజాయితి సంఘటనలు | 18 |
| 5. | ఆచరణ స్థితుల సంస్కరణ అవసరం | 21 |
| 6. | కర్మల వసరణకు అవరోధముగా నున్న కారణములు | 31 |
| 7. | మొదటి కారణము | 34 |
| 8. | రెండవ కారణము | 35 |
| 9. | మూడవ కారణము, నాలుగవ కారణము | 39 |
| 10. | ఐదవ కారణము | 41 |
| 11. | ఆరవ కారణము | 43 |
| 12. | ఏడవ కారణము | 44 |
| 13. | ఎనిమిదవ కారణము | 45 |

| క్ర.సం | శీర్షికలు | పుట |
|---|---|---|
| 12. | ఆచరణ సవరణకు మూడు విషయములు అవసరము (1) సంకల్ప శక్తి (2) విద్యా శక్తి (3) ఆచరణ శక్తి | 47 |
| 13. | సంకల్ప శక్తి భావము | 52 |
| 14. | విద్యా శక్తి భావము | 57 |
| 15. | ఆచరణ శక్తి భావము | 58 |
| 15. | సంస్థ శిక్షకులు, ఉపదేశకుల బాధ్యతలు | 59 |
| 16. | ఆచరణ సవరణకు నాలుగు సహాయముల అవసరము (1) విశ్వాసము (2) ఆచరణ (3) పర్యవేక్షణ (4) బలవంతము | 67 |
| 17. | విద్యావంతులు, శిక్షకులు హృదయములను సవరించుకొనుముము | 78 |
| 18. | అతి గొప్ప ఆయుధము ప్రార్థన (దుఆ) | 79 |
| 19. | ఆచరణ సవరణ గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఉపదేశములు | 80 |


❖❖❖

# ముందుమాట

సయ్యిద్నా హజ్రత్ అఖ్దస్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 29 నవంబర్ 2013 నుండి 7 ఫిబ్రవరి 2014 వరకు ఉపన్యసించిన 11 జుమా ఖుత్బాలలో 9 ఖుత్బాలు కర్మల సవరణ అవసరము, ప్రాముఖ్యత గురించి ప్రసంగించిరి. వీటిలో సంస్థ సభ్యులతో పాటు ప్రత్యేకముగా మురబ్బీలు, (శిక్షకులు) ముఅల్లిమీన్, (బోధకులు) సంస్థ హెూదాదారులకు కూడ వారి వారి బాధ్యతలను గుర్తు చేసిరి.

ఈ ఖుత్బాల సారాంశములు 'మన్సూబ బంది కమిటి' తరపున క్రమ పద్ధతిలో ముద్రించబడుచున్నవి. మురబ్బీలు, హెూదాదారులందరు స్వయముగా వీటిని చదివి, సంస్థ సభ్యులకు వినిపించి, చదివించే ఏర్పాట్లు చేయవలెను. ఈ ఖుత్బాలను అంతర్జాలము (ఇంటర్నెట్) ద్వారా కూడ డౌన్‌లోడ్ చేసుకొని వినవచ్చును. వీటి సీ.డి.ని నష్రో అషాఅత్ నుండి తెప్పించుకొని సంస్థ సభ్యులకు వినిపించే ఏర్పాట్లు కూడ చేయగలరు. ఈ ఖుత్బాలను గౌ॥ హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్ గారు తెలుగులో అనువదించగా గౌ॥ షబ్బీర్ అహ్మద్ యాకూబ్, గౌ॥ ముహమ్మద్ లతీఫ్ షరీఫ్ గార్లు పునఃపరిశీలన, ప్రూఫ్‌రీడింగ్ చేసిరి. అల్లాహ్ వారికి ఉత్తమ ప్రతిఫలము నొసంగుగాక!

హజ్రత్ అమీరుల్ ముమినీన్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారి ఈ ఉపదేశములను పాటించి, పాటింపజేయుటకు, సంస్థ కార్యక్రమములలో వేగమును తీసుకొచ్చుటకు అల్లాహ్ మనందరికి అనుగ్రహించుగాక! (ఆమీన్)

*నాజిర్ ఇస్లాహ్ వ ఇర్షాద్ ఖాదియాన్*

①

# ఖుత్బా జుమా సారాంశము : 29 నవంబర్ 2013

## ప్రార్థనపు నిజమైన భావము

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హజ్రత్ అమీరుల్ మొమినీన్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنْسَ إِلَّا لِيَعْبُدُونِ (అజ్జారియాత్ : 57) పవిత్ర ఖుర్ఆన్ సూక్తిని పఠించిరి. మానవ జీవిత ఉద్దేశములను వివరించుచు ఇట్లనిరి.

ప్రతి సమస్యలో అల్లాహ్ ప్రీతి దృష్టియందుండి, తన ఇహలోక ప్రయోజనములు అతని ముందు ఏ స్థాయి కలిగి వుండన్నప్పుడే ఒకడు నిజమైన ఆరాధకుడు అనబడును. తరచుగా ఈ అంశమును నేను ప్రస్తావించి సూచించుచుందును. నేడు ఈ అంశమును హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఖుత్బాతో ప్రయోజనము పొందుచు మీ ముందు ప్రవేశపెట్టెదను. సంఘటనలతో కలిపి ఒక అంశమును ప్రస్తావించే పద్ధతిని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్హు అవలంభించేవారు. వీటి ద్వారా పలు కోణముల ఆచరణ స్థితి మన ముందుకు వచ్చును.

وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنْسَ إِلَّا لِيَعْبُدُونِ (అజ్జారియాత్ : 57) అనగా నేను జిన్నాతులను, మానవులను నన్ను ఆరాధించవలెననే ఉద్దేశముతోనే లేదా నా దాసులగుటకు పుట్టించితిని. ఈ అంశమును ప్రస్తావించుచు వారు (రజి) ఇట్లనిరి. ఈ గొప్ప ఉద్దేశము కొరకు మానవుడు పుట్టించబడెను.

కాని మానవుని పుట్టుక ఉద్ధేశములో సఫలము లభించినదా ? ఏ ఉద్ధేశముతో మానవున్ని అల్లాహ్ పుట్టించినాడో ఆ పని తీసుకోగలిగినాడా ? అని పెద్ద పెద్ద ఫిలాసఫర్, విద్యావేత్తలు ప్రశ్నింతురు. వాస్తవముగా మానవుడు ఈ ఉద్ధేశమును పూర్తి చేయుచున్నాడా ? అని వారు ప్రశ్నింతురు. అల్లాహ్ దాసుడనబడు విధముగా అతడు నిజముగనే అభివృద్ధి చెందినాడా ? దీనికి సమాధానము 'కాదు' అని వారనిరి. అందుకే మానవున్ని పుట్టించు వాడున్నప్పుడు అతనికి ఇందులో ఎందుకు సఫలము లభించలేదు ? అని వారు ప్రశ్నింతురు. దీని సమాధానమేమనగా ఈ ప్రశ్నకు సమాధానము ఇచ్చుటకు సందేశహరులు అవతరింతురు. సత్కార్యపు ప్రవాహమును వారెట్లు కొనసాగింతురనగా ఈ ఉద్ధేశము పూర్తి అయినదని శత్రువు కూడ అంగీకరించును. ఆ రోజు రాక కొరకు వెయ్యి రోజులు నిరీక్షించవలసి వచ్చినను అభ్యంతరము లేదు. సందేశహరుల కాలమును కూడ అల్లాహ్ గౌరవ ప్రదమైన రాత్రి (లైలతుల్ ఖద్ర్) గా నిర్ణయించెను. అల్లాహ్ ఇట్లనెను. لَيْلَةُ الْقَدْرِ خَيْرٌ مِّنْ أَلْفِ شَهْرٍ (అల్‌ఖద్ర్ : 4) అనగా ఆ ఒక్క రాత్రి వెయ్యి రాత్రుల కంటే ఉత్తమమైనది. ఒక రకంగా సందేశహరుల ద్వారా ప్రపంచమునకు లభించే వరముతో పోల్చినచో ఒక శతాబ్ది మానవులు కూడ ఈ ఒక్క రాత్రి కొరకు త్యాగము చేయబడినను ఈ త్యాగము తక్కువే అగును. ఇట్లనిరి. ఆచరణ సవరణ కొరకు నేను ఈ సంవత్సరం కొన్ని ఖుత్బాలు ఇచ్చియుంటిని. ఇది క్రీ.శ. 1936 సంII నాటి విషయము. వారప్పుడు ఆ మధ్య కాలములో కొన్ని ఖుత్బాలిచ్చియుండిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అవతరించిన మహా గొప్ప ఉద్ధేశమును పూర్తి చేయుటకు మనము పెద్ద పెద్ద త్యాగములు ఇవ్వవలసిన

అవసరమున్నదని వారు సూచించిరి. ఇది ఆనాటి కాలపు విషయమే కాదు. ఇదొక నిరంతరం కొనసాగు చర్య. నేడు కూడ అవసరమే, రాబోవు కాలములో కూడ అవసరముండును. విశ్వాస పరంగా మనము ప్రపంచముపై పైచేయి సాధించితిమి. లేనిచో వ్యతిరేకులపై సరైన ప్రభావము పడదు. మరల వారొక ఉదాహరణ ఇచ్చిరి. ఆచరణకు ఒక సాధారణ ఉదాహరణ సత్యము. అనగా సత్యము గురించి నేనొక ఉదాహరణను ఇచ్చెదను. దీనిని ఆచరణలో చూచినచో ఎట్లుండును ? ఇది ఎటువంటి విషయమనగా శత్రువు కూడ భావించును. హృదయ విశ్వాసము, విధేయత శత్రువుకు కనపడదు. కాని అతడు సత్యమును చూడవచ్చును.

వాస్తవానికి సత్యము చాలా అధికముగా ప్రభావము చూపును. ఆ కాలములో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్‌నకు కలత కలిగేది. ఈ కాలములో కూడ నాకు పలువురి ఉత్తరములు వచ్చును. వాటిలో అహ్మదీయుల సత్యము గురించి వివరములుండును. అందుకే వారు జమాఅత్‌ను కొనియాడెదరు. ఏ అహ్మదీయులతో వారికి మోసము, అసత్యముతో సంబంధము కలుగునో వారి జమాఅత్‌నకు మంచి పేరున్నందున మేము నమ్మినాము, కాని మీ జమాఅత్‌నకు చెందిన ఫలానా ఫలానా వ్యక్తి మమ్ములను మోసగించినారని వ్రాయుదురు.

ఈ విధముగా మోసము చేయువారు ఇవి మా వ్యక్తిగత సమస్యలని ఇట్లందురు. మా స్వంత dealing (వ్యవహారము), వ్యాపారము మేము చేయుచున్నాము. జమాఅత్‌కు దీనితో సంబంధమేమిటి ? కాని అంతములో వారు జమాఅత్‌ను అప్రతిష్ట పాలుచేయుటకు, జమాఅత్‌ను నిందారోపణలకు గురి చేయుటకు కూడ కారకులగుదురు.

## హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి సత్యము, నిజాయితి ఉదాహరణలు

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రకటన కంటే పూర్వపు ఒక సంఘటన హజ్రత్ ముస్లిహ్ (రజి) తెలిపిరి. కుటుంబ ఆస్తి గురించి ఒక వాజ్యము యుండెను. ఈ గృహము ముందట ఒక వరాండా నిర్మించబడి యుండెనని స్థలము చూపబడెను. ద్వితీయ ఖిలాఫత్ హయాంలో అక్కడ కొన్ని కార్యాలయములు యుండెడివి. ఇప్పుడు ఖాదియాన్‌లో కొన్ని మార్పులు చోటు చేసుకున్నవి. కార్యాలయములు అక్కడి నుండి తరలించబడినవి. వాస్తవానికి ఆ వరాండా స్థలము మా కుటుంబమునకు చెందినదై యుండెను. కాని అది చాలా కాలము నుండి దాని ప్రక్కనున్న ఇంటి వారి అధీనములో యుండెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సోదరుడు దానిని పొందుటకు వాజ్యము వేసెను. ప్రాపంచిక పద్ధతి ప్రకారము ఇటువంటి విషయములలో సత్యా అసత్యా సాక్షులను ఏకము చేసి నిజమైన హక్కు గల వారికి లభించుటకు ప్రయత్నింతురు. వారి పెద్ద సోదరుడు కూడ అలాగే చేసెను. అనేక సాక్ష్యాలు తీసుకొచ్చిరి. మాకెలాంటి నిదర్శనము అవసరం లేదు. వారి చిన్న సోదరున్ని పిలిచి సాక్ష్యము తీసుకోగలరు. వారే సాక్ష్యము చెప్పినా మేము అంగీకరింతుమని గృహ యజమానులు అనిరి. అనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గురించి. కనుక హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం న్యాయస్థానములో పిలువబడిరి. ఈ మార్గము నుండి వచ్చు పోవుచు, అక్కడ కూర్చొని వుంటున్నట్లు మీరు కొంత కాలము నుండి వారిని చూచుచున్నారా అని వారిని అడిగిరి. అవును నేను చూచుచున్నాని వారనిరి. న్యాయస్థానము వైరి వర్గము పక్షమున తీర్పు

చెప్పెను. వారి సోదరుడు వారిపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తపరచెను. వాస్తవము ఇదే అయినందున నేనెట్లు నిరాకరింతునని వారనిరి.

వారు తపాలా శాఖను మోసగించినట్లు మరో వాజ్యము కొనసాగినది. అప్పుడున్న చట్టము ప్రకారము ఒక వ్యక్తి ఏదేని ప్యాకెట్‌లో పార్సిల్ లేదా ఉత్తరము, చిట్టి పెట్టినచో అతడు తపాలా శాఖను మోసగించి డబ్బులు మిగిల్చుకున్నాడని భావించేవారు. ఇదొక క్రిమినల్ వాజ్యము కోవలోకి వచ్చేది. కారాగార శిక్ష పడేది. వారొక వ్యాసమును ప్యాకెట్‌లో ముద్రణాలయమునకు పంపుచు ఆ వ్యాసము లేదా కరపత్రము గురించి యున్న మరో ఉత్తరము దానితో పెట్టి పంపిరి. అందులో కొన్ని సూచనలు యుండెను. వారు దానిని అందులోని భాగముగనే భావించిరి. నష్టము కలిగించే ఉద్దేశము లేకుండెను. బహుశా ముద్రణాలయ యజమాని క్రైస్తవులై యుండిరి. వారు ఫిర్యాదు చేసినందున వాజ్యము వేయబడెను. వ్యతిరేకించే వారి ఉద్దేశము స్పష్టముగా నున్నది. కనుక సాక్షుల వాస్తవము అర్థరహితము, నేను వేయలేదని మీరు నిరాకరించినచో ఏమి కాదని న్యాయవాది అనెను. అది సాధ్యము కాదు. ఆ పని నేను చేసినప్పుడు దానిని ఎలా తిరస్కరించగలనని వారనిరి. న్యాయస్థానములో ప్రవేశపెట్టబడిరి. ఇటువంటి ఏదేని వ్యాసము మీరు వేసినారా ? అని న్యాయస్థానము ప్రశ్నించెను. అవును వేసియుంటిని. కాని మోసము చేయుటకు కాదు, నేను దానిని ఆ ఉత్తరపు ఒక భాగముగనే భావించినానని వారనిరి. ఈ సత్యము న్యాయస్థానమును ఎంతో ప్రభావితము చేసెను. ఒక అనుమానాస్పద నేరము వలన ఒక సత్యవంతున్ని, సత్పురుషున్ని శిక్షించడం భావ్యము కాదని అతడు నిర్దోషిగా ప్రకటించెను.

సందేశహరులు ప్రపంచములో అవతరించి సన్మార్గము, సత్యమును స్థాపింతురు. దర్శించువారు ప్రభావితము కాక వుండలేని ఆదర్శమును ప్రదర్శింతురు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ప్రపంచములో అవతరించి ఏదేని ఫిరంగులు, మషీన్‌గన్లను ఆవిష్కరించలేదు. బ్యాంకులను జారీ చేయలేదు. కర్మాగార ఆవిష్కరణలు చేయలేదు. కనుక వారు ప్రపంచానికి ఇచ్చినదేమిటి ? దేనిని రక్షించే బాధ్యత వారి అనుచరులపై పడినది. అవి సత్యపు స్ఫూర్తి, సత్‌ప్రవర్తనలే. ఇవి గతములో కనుమరుగై యుండెను. వారు ముందుగా దానిని సంపాదించిరి. అనంతరం నిధిని ప్రపంచానికి ప్రసాదించిరి. ఈ విషయములను రక్షించుటయే అనుచరుల, వారి సంతానము, భావి తరాల కర్తవ్యముగా యుండెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంపై ప్రథమ సువార్తవాణి అవతరించినప్పుడు సకల జనులకు అల్లాహ్ సందేశము అందివ్వాలనే విషయమును విని వారు కొంత భయాందోళనకు గురైరి. ఎందుకనగా వారే విధముగా ఈ గొప్ప బాధ్యతను నెరవేర్చగలరు ? ఇదే భయాందోళనలో వారు ఇంటికి చేరుకొనిరి. హజ్రత్ ఖదీజా రజియల్లాహు తఆలా అన్‌హా వద్దకు వచ్చిరి. అతి భావాల వలన వారప్పుడు చలితో వణుకుచుండిరి. వారు గృహములో చేరగానే నాకు వస్త్రము తొడిగించుము, నాకు దుప్పటి కప్పుమనిరి. మీకు ఏ బాధ కలిగినది ? అని హజ్రత్ ఖదీజా (రజి) వేడుకొనిరి. వారు పూర్తి సంఘటన వినిపించిరి. హజ్రత్ ఖదీజా ఇట్లు సమాధానమిచ్చిరి. كَلَّا وَاللّٰهِ لَا يُخْزِيْكَ اللّٰهُ اَبَدًا కాదు ఎన్నటికి కాదు. అల్లాహ్ ప్రమాణము! అల్లాహ్ ఎన్నటికి మిమ్ములను అవమానపర్చడు. ఎందుకనగా మీలో ఫలానా ఫలానా విశిష్టతలు గలవు. ఆ విశిష్టతలలో ఒక ప్రత్యేకత ఇది కూడ తెలిపిరి. ప్రపంచములో

కనుమరుగైన సద్గుణములను మీరు తమ ఉనికిలో మరల జీవింపజేసిరి. మానవుడు కోల్పోయిన ఈ సామాగ్రిని మరల అన్వేషించిరి. కనుక అల్లాహ్ ఏ విధముగా తమరిని వృథా చేయును. సందేశహరుల అవతరణ ఉద్ధేశము ఇదే. విశ్వాసులకు ఇదే న్యాసము అప్పగించబడును. దానిని రక్షించుట వారి కర్తవ్యము. ప్రేమ వలన సందేశహరుల ఉనికి నిస్సందేహముగా విశ్వాసులకు చాలా ప్రియమైనదై యుండును. కాని వాస్తవానికి ఏ కాంతిని ప్రపంచమునకు అందజేయుటకు అల్లాహ్ వారిని పంపునో దాని వల్లనే సందేశహరుల నిజమైన గొప్పతనము యుండును. వారు తీసుకువచ్చే దైవ సందేశమే వారికి గొప్పతనమిచ్చును. ఒక సందేశహరుని ఉనికి రక్షణ కొరకు తమ ప్రాణములను త్యాగము చేయుటకు అనుచరులు సిద్ధముగా నున్నప్పుడు ఆ సందేశము కొరకు ఇంకా ఏమేమి చేయుటకు సిద్ధముండరు!.

## ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గౌరవనీయ అనుచరుల త్యాగము

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లనిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ప్రాణ రక్షణ కొరకు గౌరవనీయ అనుచరులు త్యాగమిచ్చిరి. ఆ సంఘటనలను చదివి శరీర రోమాలు బొడుసుకొనును. వారి ప్రేమను చూచి నేడు హృదయములో ప్రేమ అల పరుగెత్తును. ఉహద్ యుద్ధములో ఒక సందర్భమిట్లు వచ్చెను. ఒకే ఒక్క అనుచరుడు మాత్రమే రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వెంట మిగిలెను. శత్రువు వరుసగా బాణములు, రాళ్లు కురిపించుచుండెను. ఆ అనుచరుడు తన హస్తము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్రమైన ముఖము ముందట పెట్టెను. దానిపై ఎన్ని బాణములు, రాళ్లు పడినవనగా అది శాశ్వతముగా

నిరుపయోగముగా మారెను. ఒక అనుచరుడు అప్పుడు ఏమైనది ? అని అడిగెను. వారిట్లనిరి. ఎన్ని బాణములు, రాళ్ళు దీనిపై పడెననగా ఇది శాశ్వతముగా నిరుపయోగమైనది. మీ నోట ఆహ్ అని వెలువడలేదా ? అని అనుచరుడు అడిగెను. వారు చాలా ఆసక్తికరమైన సమాధానమిచ్చిరి. అవును ఆహ్ అనాలని అనిపించెను. కాని నేను వెలువడనిచ్చేవాడిని కాదు. ఎందుకనగా ఆహ్ అన్నచో హస్తము కదిలేది. అప్పుడు ఏదేని బాణము రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు తగిలేది. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. మీరు ఈ త్యాగమును అంచనా వేయుము, ఆలోచించుము. నేడు ఒకని వేలుకు గాయమైనచో అతడెంత అల్లరి చేయును. కాని ఆ అనుచరుడు హస్తముపై ఎన్ని బాణములు తీసుకొనెననగా అది శాశ్వతముగా నిరుపయోగమయ్యెను.

మరో అనుచరుని సంఘటన ఇట్లు ప్రస్తావించిరి. ఇది కూడ ఉహద్ సంఘటనే. ఉహద్ యుద్ధములో కొందరు అనుచరులు తప్పని పరిస్థితులలో వెనుకకు జరిగి మరల ఏకమైనప్పుడు ఎవరెవరు అమరులైరి, ఎవరెవరు గాయపడిరో చూడమని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. అందుకు కొందరు అనుచరులు మైదానమును పరిశీలించుటకు వెళ్లిరి. ఒక అన్సారి అనుచరుడు మైదానములో గాయపడి యున్నట్లు మరో అనుచరుడు చూచెను. అతడు వారి వద్దకు వెళ్లగా వారి చేతులు, కాళ్ళు కోయబడి, జీవితపు అంతిమ ఘడియలో యున్నట్లు తెలిసినది. ఆ అనుచరుడు వారికి మరింత దగ్గరై మీ చిరంజీవులకు ఏదైనా సందేశము ఇవ్వదలచినచో ఇవ్వగలరు, నేను వారికి అందింతునని అనెను. నా సమీపమునకు ఎవరైనా వచ్చినచో అతనికి సందేశము ఇత్తునని

నిరీక్షించుచుంటిని. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక విలువైన న్యాసము, మేము బ్రతికి వున్నంత వరకు మా ప్రాణములతో దానిని రక్షించినాము. ఇప్పుడు మేము వెళ్లిపోవుచున్నందున నా సమీప బంధువులు మా కంటే గొప్పగా త్యాగములు సమర్పించి ఆ విలువైన న్యాసమును రక్షింతురని ఆశించుచున్నానని నా సమీపులకు, నా ఇంటివారికి, భార్యా పిల్లలకు సందేశమివ్వుమని అనెను. పరిశీలించుము, మరనించే సమయమున భార్యాభర్తలకు సందేశమిచ్చుటకు మరల సమయము లభించదని వారికి తెలుసు. ఇటువంటి సమయములో ఆస్తి, ఆర్థిక లావాదేవీల గురించి తెలిపే ఆలోచన మానవునికి కలుగును. వెనుక వుండిపోయే వారి మంచి గురించి ఆలోచించెదరు. కాని అప్పుడు కూడ ఆ అనుచరునికి నేను నా ప్రాణమిచ్చి ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను రక్షించుచున్నాననే ఆలోచన కలిగెను. మీరు కూడ ఇదే చేయుదురని, ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రాణమునకు బదులు తమ ప్రాణములను లెక్క చేయరని ఆశించుచున్నాని సమీపులకు కూడ సందేశమిచ్చుచున్నారు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉనికి కొరకు ఈ త్యాగములు చేసినవారు, వారు తీసుకొచ్చిన సందేశము కొరకు ఏమేమి చేయుటకు సిద్ధపడరు. వారేమేమి చేసి యున్నారు ? ఇందుకు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మృత్యువు సంఘటనను ప్రవేశపెట్టుతానని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) అనిరి.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో హజ్రత్ అబూబకర్ రజియల్లాహు అన్హుకు ఎంత ప్రేమ యుండెనో గమనించుము. వారు మృతి చెందినారని వారికి తెలిసినప్పుడు అనుకోకుండానే వారి పవిత్ర

శరీరమును ముద్దు పెట్టుకొనిరి. కన్నీరు ప్రవహించెను. కాని రెండవ వైపు వారు తెచ్చిన సత్యముతో ఎంత ప్రేమ యుండెను. హజ్రత్ ఉమర్ (రజి) వంటి వీరుడు వారు చనిపోయినారని అనే వ్యక్తిని నేను హతమార్చుతానని నిలబడిరి. అనేక అనుచరులు వారితో ఏకీభవించిరి. అయినను వారు నిర్భయముగా ఇట్లందురు. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బ్రతికి వున్నారని అనే వాడు వారిని దేవునిగా భావించినట్లగును. వారు మృతి చెందినారని నేనతనికి తెలిపెదను. కాని ఏ దేవున్ని ఆరాధింపజేయుటకు వారు వచ్చిరో అతడు బ్రతికేయున్నాడు. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులలో పుట్టించిన సత్యపు ప్రభావమిది. నగ్న ఖడ్గములు పట్టుకొని నిలబడిన అనుచరులు ఈ విషయము వినగానే తమ తల దించుకొని, నిజమే వారు మృతి చెందినారని అంగీకరించిరి.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. హజ్రత్ అబూబకర్ (రజి) నకు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో ఎంత ప్రేమ యున్నదో క్రింది సంఘటనతో స్పష్టమగును. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ మరణము కంటే ముందు సీరియాలోని కొందరు వ్యతిరేకులను వారి ఆగడాల వలన శిక్షించవలెనని ఒక సైన్యమును సిద్ధపరచి యుండిరి. ఈ సైన్యము ఇంకా బయలు దేరక ముందే వారు సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందిరి. వారి మరణము తర్వాత హజ్రత్ అబూబకర్ (రజి) ఖలీఫాగా ఎన్నికైరి. అధిక అనుచరులు ఏకగ్రీవముగా నిర్ణయించుకొని వారితో ఇట్లనిరి. నలు వైపుల నుండి తిరుగుబాటు వార్తలు అందుచున్నవి. మక్కా, మదీనాలోనే సామూహిక నమాజ్ అగుచుండెను. ప్రజలు నమాజ్ చదవడం కూడ వదిలిరి.

మేము జకాత్ చెల్లించమని ప్రజలు ప్రకటించుచుండిరి. ఈ సైన్యమును నిలిపివేయాలని అనుచరులు హజ్రత్ ఉమర్ (రజి) ను హజ్రత్ అబూబకర్ (రజి) వద్దకు పంపిరి. ఎందుకనగా వృద్ధులు లేదా పిల్లలు మాత్రమే మదీనాలో యున్నచో తిరుగుబాటుదారులను ఎలా ఎదురించగలరు. అనగా ఇతర తిరుగుబాటుదారులను మదీనా వృద్ధులు ఎలా ఎదురించగలరు. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పంపిన సైన్యమును నిలిపివేసే శక్తి అబూఖహాఫా కుమారునికి ఎక్కడిది. అల్లాహ్ ప్రమాణము! తిరుగుబాటు దారులు మదీనాలో ప్రవేశించి, మన స్త్రీల శవములను కుక్కలు ఈడ్చుకెళ్లినా ఆ సైన్యము తప్పక బయలు దేరునని హజ్రత్ అబూబకర్ (రజి) సమాధానమిచ్చిరి. హజ్రత్ అబూబకర్ (రజి) కు వారితో ఎంత ప్రేమ యుండెనో దీనితో తెలియును. వారు సిద్దీఖియ్యత్ (సత్యపు) స్థాయి కలిగియున్నందున ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తీసుకొచ్చిన బోధన ప్రాముఖ్యత ఎంత గొప్పదో తెలిసి యుండిరి. కనుక అల్లాహ్ పంపిన బోధనను వారు తీసుకొని స్థిరపరచిరి. అది ఇసుమంత కూడ మార్చబడలేదని శత్రువు కూడ అంగీకరించును. పవిత్ర ఖుర్ఆన్ ఒక్క బిందువు కూడ మార్చబడలేదని క్రైస్తవులు, హిందువులు, యూదులు మొ॥ అందరు వ్యతిరేక జాతులు అంగీకరించును.

వారింకా ఇట్లు తెలిపిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కాలములో ఇటువంటిది ఒక సమూహముండెను. కాని భావి తరాలలో కూడ ఇదే ఉత్సాహము యున్నదా ? అను ప్రశ్న ఉత్పన్నమగును. ఒక మంచి వస్తువు అతనికి లభించి అతని సంతానమునకు లభించకూడదని ఒక వివేకి ఊహించునా! హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం

బోధన ప్రాముఖ్యత, విలువ తెలిసిన వ్యక్తి తమ వారసులకు అది లభించక అతని ఆస్తి, పాస్తులు లభించవలెనని ఊహించునట్లు మీరు భావించగలరా!

ధర్మము వరమని అల్లాహ్ సూచించును. ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యతనిత్తుమని ప్రకటించే వారిలో ధర్మము నుండి తమ సంతానమును దూరముంచువారు, దాష్కార్యములలో వారికి సహకరించే వారెలా యున్నారు. అహ్మదియ్యత్, విశ్వాసము వారిలో యుండే బదులు మంచితనము, మానవత్వము రోధించు నేరములకు కూడ వారు పాల్పడుచున్నారు. కాని ఇటువంటి నేరస్థుల తల్లిదండ్రులు, సోదరులు, బంధువులు అందరు వారికి సహకరింతురు. ఇలా చేయడంతో విశ్వాసము ఎక్కడ మిగులుతుంది ? అని ఆలోచించరు. ఇటువంటి వ్యక్తి ధర్మము ఆకాశమునకు చేరును. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను చూడుము. ఒక సారి ఒక నేరస్తురాలి గురించి కొందరు అనుచరులు వారి వద్ద సిఫారసు చేయగా వారిట్లనిరి. అల్లాహ్ ప్రమాణము! నా కూతురు ఫాతిమా కూడ దొంగతనము చేసినచో శిక్ష నుండి తప్పించుకోలేదు. ధర్మబద్ధత, పవిత్రత ఎటువంటి వరమనగా మానవుడు దీని కొరకు దేనినైనా త్యాగము చేయవచ్చును. ఉత్తమ సద్గుణముల ధనమే మనకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంతో లభించినది. మన సంతానమును దీనికి వారసులుగా చేయుట మన కర్తవ్యము. నిర్లక్ష్యము వలన ఇందులో ఏదేని పొరపాటు జరిగినచో تَعَاوَنُوا عَلَى الْإِثْمِ అనగా పాపములో సహాయము చేయకపోవడం విశ్వాసుని బాధ్యత. నేరము చేసిన వానితో వెంటనే విడిపోవలెను. విశ్వాసుల గురించి అల్లాహ్ ఇచ్చిన సామెతలను చూచినచో

ఈ విధముగా చేయుట అసాధ్యమని ఎవరు అనలేరు.

## హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అనుచరుల సత్యము, నిజాయితి సంఘటనలు

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అనుచరుని సామెత ఇచ్చుచు వారిట్లనిరి. క్రీ.శే.సయ్యద్ హామిద్ షాహ్ గారు చాలా విశ్వసనీయులు, విధేయులైయుండిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారిని తమ పన్నెండు (హవారి) అనుచరులలో ఒకరిగా పరిగణించిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నా ముందు అనుచరుల పేర్లు తెలిపినప్పుడు వారి పేరు కూడ చెప్పిరని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) అనిరి. వారి సత్యమైన అంతము వారి స్థాయి గురించి ముద్ర వేసెను. ఒక సారి వారి కుమారునిచే ఒక వ్యక్తి హతమయ్యేను. ఆ హత్య జరిగిన పరిస్థితుల వలన ప్రజల సానుభూతి వారి కుమారునితో యుండెను. ఈ మహా సజ్జనుడు సయ్యద్ హామిద్ అలి షాహ్ కుమారునితో ఒక హత్య జరిగెను. వారితో, వారి కుమారునితో ఈ హత్య జరిగినను ప్రజలు సానుభూతి తెలుపుచుండిరి. ఎందుకనగా హతుడు దౌర్జన్యము చేసెను. తద్వారా జరిగిన వివాదములో వారి కుమారుడు ఒక గుద్దు గుద్దగా అతడు చనిపోయెను. హజ్రత్ మూసా (అ) కాలములో జరిగిన సంఘటన వలె ఇది జరిగెను. సియాల్కోట్ డిప్యూటి కమీషనర్ ఆంగ్లేయుడైయుండెను. నేరము ఋజువైనా కాకున్నా భయముండుటకు శిక్ష తప్పక ఇచ్చే అధికారులలో అతను యుండెను. హామిద్ షాహ్ గారు నా కార్యాలయ సూపరింటెండెంట్ అని అతనికి ఆలోచన కలిగెను. అందుకే షాహ్ గారిని పిలిచి మీ కుమారుడు నిజముగనే హత్య చేసినాడా ? అని ప్రశ్నించెను. అవును చేసినాడని విన్నాను.

కాని నేనక్కడ లేకుంటినని వారనిరి. మేమెవరిని ఖాతరు చేయమని ప్రజలకు తెలియుటకు అతన్ని పిలిచి ఒప్పుకోవలెనని చెప్పమని అనెను. తన కుమారున్ని పిలిచి నీవు అతన్ని చంపినావా? అని వారడిగిరి. అతను అవునని అనెను. అటులైనచో సత్యమును అంగీకరించుమని వారనిరి. ఎందుకు తమ యువకుడైన కుమారునికి ఉరిశిక్ష ఇప్పించుచున్నావని ప్రజలనిరి. ఇహలోక శిక్ష కంటే పరలోక శిక్ష కఠినమైనదని వారనిరి. సత్యమును అంగీకరించుమని తన కుమారునికి సూచించిరి. దైవ నిర్ణయము ప్రకారము అతడు అంగీకరించెను. ఆ యువకుడు క్రికెట్ ఆడేవాడు. ఏ న్యాయమూర్తి వద్ద ఆ వాజ్యము యుండెనో, ఆ న్యాయమూర్తి కూడ క్రికెట్ ఆడేవారు. అతనికి క్రికెట్ క్లబ్‌లో యదార్థము తెలిసినది. న్యాయమూర్తికి వాస్తవము తెలిసినచో నిందితున్ని ఏమి అగడవలసిన అవసరం లేదని చట్టములో లొసుగు యున్నది. అతడు స్వయముగా పోలీస్‌ను కఠినముగా ప్రశ్నించినందున ఆ యువకుడు నిర్దోషిగా బయటపడెను. కనుక అతన్ని ఏమి ప్రశ్నించకుండానే విడుదల చేసెను. సత్యము వలన అతడు శిక్ష నుండి మోక్షము పొందెను.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఇటువంటిదే ఒక వాజ్యము కొద్ది రోజుల క్రితం చౌధ్రి జఫ్రుల్లాహ్ ఖాన్ గారి సోదరుని గురించి జరిగినది. చౌధ్రి గారప్పుడు విదేశములో యుండిరి. (ఇక్కడ లండన్‌లో యుండిరి). ఇది విశ్వాసపు పరీక్ష సమయమని వారు తమ సోదరునికి వ్రాసిరి. నీతో పొరపాటు జరిగినచో నేను నీ పెద్ద సోదరునిగా నీకు ఉపదేశించునదేమనగా ఇహలోక శిక్ష కంటే పరలోక శిక్ష కఠినమైది. కనుక దీనిని భరించుచు సత్యమును అంగీకరించుము.

మరల వారిట్లనిరి. ఇప్పటికి సజీవముగా నున్న అహ్మదీ అయిన ఒక సియాల్కోట్ నివాసి ఇట్లనిరి. అహ్మదీ అయిన తర్వాత లంచము తీసుకొనుట నిషేధమని తెలిసినప్పుడు ఎవరెవరితో లంచము తీసుకొనిరో వారి వారి ఇంటికి వెళ్లి లంచము తిరిగిచ్చిరి. అందు వలన వారు చాలా ఇబ్బందిలో పడిరి. ఋణగ్రహీతులైరి. కాని వారు అందుకు చింతించలేదు. అనుచరుల వలె ఉదాహరణలు వున్నవని చెప్పుటకు మన జమాఅత్‌లో అన్ని రకముల ఉదాహరణలు గలవని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) అనిరి. మనము ఇంతటితోటే సంతోషపడక సమస్త జమాఅత్ అటుల కావలెనని ప్రయత్నించవలెను.

శ్రద్ధ కలిగించబడినప్పుడు దానిని శ్రద్ధతో విని ఆచరణాత్మక జీవితములో భాగముగా చేసుకోవలెను. ఇదే జమాఅత్ అభివృద్ధి రహస్యము. ఇదే మానవున్ని సరైన దాసునిగా చేయును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను అల్లాహ్ పంపి వారిపై పెద్ధ భారము మోపినాడని జమాఅత్ తెలుసుకోవలసిన అవసరమున్నది. మానవునిలో బలహీనతలు పర్వతమంత యున్నను, వీడుటకు సంకల్పించినచో కష్టమేమి కాదు.

మిత్రులు తమ తమ సంతానము, జమాఅత్ ఇతర యువకులకు శిక్షణనిచ్చి సంస్కరించవలెనని నేనిప్పుడు చెప్పదలచితిని. తమను తాము సవరించుకొనుము. అబద్ధము, దొంగతనము, తిరుగుబాటు, మోసము, కుట్ర, దుష్ప్రవర్తన, చాడీలు చెప్పుట వంటి దురలవాట్లను వీడుము. వీరితో వ్యవహరించు వ్యక్తి కూడ వీరు చాలా ఉత్తములని భావించవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ద్వారా మనకు లభించిన ఈ వరము మరల వచ్చుటకు పదమూడు వందల సంవత్సరముల కాలము

పట్టినదని గుర్తుంచుకొనుము. మనము దీనిని గౌరవించనిచో మరల పదమూడు వందల సంవత్సరములు పట్టును, తద్వారా రాబోవు తరాల శాపములన్ని మన మీద పడును. కనుక సత్కార్యములన్నిటిని తమ సంతానమునకు ఇచ్చుటకు ప్రయత్నించుము. వారు ముందు వారికిత్తురు, తర్వాత వారు తమ సంతానమునకు ఇత్తురు. వేలాది సంవత్సరముల వరకు మనకు దీని పుణ్యము లభించుటకు ఈ పరంపర సుదీర్ఘ కాలము వరకు కొనసాగవలెను. ఏ సత్కార్యము ఒక వ్యక్తి వలన ఏర్పడునో, అది ప్రపంచములో ఎప్పటి వరకు కొనసాగునో, ఎంత మంది దానిని అవలంభింతురో వారందరి పుణ్యము అతని పేరిట వ్రాయబడునని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచించిరి. లభించే ప్రతిఫలము కూడ గొప్పదే. న్యాసము కూడ తన పరిధిలో చాలా పెద్దదే. ఇటు వైపు మనము శ్రద్ధ వహించవలెను. ❖

(అల్ ఫజల్ 26 ఆగస్టు 1936, సౌజన్యము – ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 17 పుట 547 – 559)

②

# ఖుత్బా జుమా సారాంశము : 6 డిశంబర్ 2013

## ఆచరణ స్థితుల సంస్కరణ అవసరం

హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మనలో ఏర్పాటు చేయదలచిన మార్పు కోణములో మనము చూచినప్పుడు ఆ స్థితి ఎట్లుండెను ? అప్పుడు కలత చెందెదము. మనలో

ప్రతి ఒక్కరం సమాజములోని దుష్కార్యములను ఎదురించి ఓడించుచున్నామా అను ప్రశ్న తలెత్తును. మనలోని ప్రతి ఒక్కరి ఆచరణను చూచి అతనితో సంబంధమున్న, అతని పరిధిలో, అతని సమాజములో యుంటున్న వ్యక్తి అతనితో ప్రభావితమగుచున్నాడా? లేదా మనమే సమాజముతో ప్రభావితమై మన బోధన, మన సాంప్రదాయాలను మరచి పోవుచున్నామా? మనలోని ప్రతి ఒక్కరు శక్తి మేర కృషి చేయుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మనకు బోధించిన విధముగా ఆచరణ స్థితిని సంస్కరించుకుంటున్నామా? మనతో కోరినది, మనతో ప్రశ్నించబడునది ఏమనగా అసత్యము, మోసము మన దరి దాపులకు రావడానికి కూడ భయపడే విధముగా సత్యపు ప్రమాణమును మనము అందుకొన్నామా?మనము మన ఇహలోక సమస్యలను పరిష్కరించుకుంటూనే పరలోకమును కూడ ఆలోచించుచున్నామా? మనము వాస్తవ రూపంలో ధర్మమునకు ప్రాపంచికముపై ఆధిక్యత ఇచ్చుచున్నామా? మనము ప్రతి దుష్కార్యము, దుష్టత్వము నుండి అతి జాగ్రత్తగా సురక్షితముగా నుండుటకు ప్రయత్నము చేయుచున్నామా? ఒకరి హక్కులను హరించుట నుండి దూరముండి, అక్రమ అధికారము నుండి దూరముండుచున్నామా ? మనము ఐదు పూటల నమాజులను సలుపుచున్నామా? సదా మనము దుఆ చేయుచున్నామా? అల్లాహ్‌ను నిరాడంబరతతో స్మరించుచున్నామా? మనపై దుష్ప్రభావము వేయు ప్రతి దుష్ట మిత్రున్ని మనము వీడుచున్నామా? మనము మన తల్లిదండ్రులకు సేవలు చేయుచు, వారిని గౌరవించుచు, వారి సముచిత ఆదేశములను మనము పాటించుచున్నామా? మనము మన భార్య, ఆమె బంధువులతో మర్యాదపూర్వకముగా, ఉపకారముతో మంచిగా వ్యవహరించు

చున్నామా ? మనము మన ఇరుగు పొరుగు వారిని చిన్న చిన్న సత్కార్యముల నుండి దూరము చేయుట లేదు కదా? మనకు నష్టము కలిగించిన వారిని మనము క్షమించుచున్నామా? మన హృదయములు ఇతరుల కొరకు అసూయ, కుట్రతో పవిత్రముగా నున్నవా? ప్రతి భర్త, భార్య పరస్పరం నిజాయితిగా హక్కులు చెల్లించుచున్నారా? మనము బైఅత్ ప్రతిజ్ఞను దృష్టియందుంచుకొని మన స్థితులను సవరించుకుంటున్నామా? మన సమావేశములు ఇతరులపై నిందలు మోపుచు, చాడీలు చెప్పుకొనుటకు నిర్వహించడం లేదు కదా? మన సమావేశములలో అధికముగా అల్లాహ్, అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను స్మరించుచున్నామా ?

వీటి సమాధానము అవునని కానిచో మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బోధన నుండి చాలా దూరమున్నాము. మనకు మన కర్మల సవరణ గురించి కలత చెందవలెను. దీని సమాధానము అవును అయినచో మనము అదృష్టవంతులము. మనలో ఎవరికి అవును అని సమాధానము లభించునో వారు అదృష్టవంతులు. మనము మన కర్మల సవరణ గురించి శ్రద్ధ వహించుచు బైఅత్ హక్కును చెల్లించువారమగుదుము.

కాని వాస్తవమైన దృష్టితో మనము చూచినచో మనకు లభించు సమాధానమేమనగా కొన్ని సార్లు సమాజపు ప్రవాహముతో మనము ప్రభావితమైనాము. ఈ విషయములను లేదా వీటిలోని అధిక విషయములను మనము దృష్టియందుంచుకోము. విశ్వాసము పరంగా మేము దృఢముగా నున్నాము, ఎవరు మమ్ములను మా విశ్వాసము నుండి కదిలించలేరు, తొలగించలేరని మనలోని 99.99 శాతం అందురు. ఇందులో ఎలాంటి సంశయము లేదు. కాని ఆచరణ బలహీనతలు సమాజపు గట్టి దాడుల

ప్రవాహములో వచ్చినప్పుడు విశ్వాసపు పునాదులను కూడ పెకిలించడం మొదలు పెట్టునని మనము సదా గుర్తుంచుకోవలెను. షైతాన్ ఆచి తూచి దాడి చేయును. జమాఅత్ వ్యవస్థతో దూరము పెరగడం మొదలగును. అనంతరం ఒక్క అడుగు ముందుకేసి ఖిలాఫత్ నుండి దూరమవడం మొదలగును.

ఒక బలహీనత రెండవ బలహీనతకు కారణమగునని మనము గుర్తుంచుకోవలెను. తుదకు సర్వము నాశనమగును. జమాఅత్ వ్యవస్థ, ఖిలాఫత్ వ్యవస్థలో ఇమిడి పోవడములోనే అహ్మదియ్యత్ అందము గలదని మనకు తెలుసు. ఇదే మన విశ్వాస శక్తి, ఇదే మన ఆచరణ శక్తి. కనుక వర్తమాన ఖలీఫాల ద్వారా సదా బలహీనతలను గుర్తించి జమాఅత్‌నకు సూచించడం జరుగుతుంది. తద్వారా ఏ ఒక్క అహ్మదీ కూడ తిరిగి వచ్చుటకు దారి లభించనంత దూరము పోకుండా తన ఆచరణ బలహీనతలను దృష్టిలో యుంచుకొని, బలహీనతలను దూరము చేసుకొనుటకు ప్రయత్నించును. అతనిపై అల్లాహ్ చేసిన ఉపకారమును అతను గుర్తు చేసుకోగలడు.

తూర్పులోని దూరపు ప్రాంతమును నేను పర్యటించినప్పుడు ఇండోనేషియాలోని కొందరు జమాఅతేతర నిపుణులు, విద్యావేత్తలు నాతో సమావేశమైరి. సింగపూర్‌లో జరిగిన reception (విందు) లో కూడ వచ్చియుండిరి. నేను నా పర్యటన వివరములలో ప్రస్తావించినట్లు మా పండితులు కూడ అహ్మదియ్య జమాఅత్ మాటలను వినవలెనని అధికులు అనిరి. వారి ఒక ప్రశ్నకు సమాధానముగా నేనిట్లు చెప్పినాను. నేడు జాతీయ లేదా ప్రాంతీయముగా కాక ప్రపంచవ్యాప్తముగా నున్న జమాఅత్ ఒక్క అహ్మదియ్య జమాఅతే. ప్రపంచమంతటా జమాఅత్‌గా గుర్తింపు పొందినది.

దీనికి ఒకే ప్రణాళిక గలదు. ఒకే వ్యవస్థ కొనసాగును. ఒకే ఇమామ్‌తో ముడిపడి యున్నది. ప్రపంచములోని ప్రతి జాతి, ప్రతి సంతానపు వ్యక్తి ఇందులో ప్రవేశించియున్నాడు. ముస్లిం సమాజములో ఒక జమాఅత్ అగుననే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశము, భవిష్యవాణికి ఇదొక పెద్ద నిదర్శనము. సత్పథముపై నుండు ఒక జమాఅత్ అగునని వారు ఉపదేశించిరి. (సునన్ అత్తిర్మిజి కితాబుల్ ఈమాన్ బాబ్ మా జాఅ ఫీ ఇఫ్తిరాఖి హాజిహిల్ ఉమ్మతి హదీస్ నెం.2641) ఇది ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన ప్రియుని సత్యమునకు నిదర్శనము. వివేకవంతులైన, సత్యస్వభావము గల విరోధులు కూడ ఈ విషయమును విని మౌనము పాటింతురు, ఆలోచనలో పడిపోవుదురు. కాని ఈ నిదర్శనమును ఎల్లప్పుడు కొనసాగించుటకు మనలోని ప్రతి ఒక్కరు తన ఆచరణ స్థితుల వైపు అనుక్షణం దృష్టి సారించవలెను. ఎందుకనగా షైతాన్ ఈ కాలములో గతము కంటే గట్టిగా దాడులు చేయుచున్నది.

నేడు ఆచరణ ప్రమాదములో సమాజపు దుష్టత్వములు హద్దులు దాటి వ్యాపించుచున్నవి. మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు అభిప్రాయ స్వేచ్ఛ పేరున పలు దుష్టత్వములకు చట్టపరమైన రక్షణ కల్పించడం జరుగుతుంది. అనగా వీధి దుష్టత్వము వీధిలో, నగర దుష్టత్వము నగరములో, దేశ దుష్టత్వము దేశములోనే యుండెడిది. లేదా అధికమైనచో ఇరుగు పొరుగు వారు ప్రభావితమయ్యేవారు. కాని నేడు ప్రతి వ్యక్తిగత, ప్రాంతీయ దుష్టత్వమును అంతర్జాతీయ దుష్టత్వముగా ప్రయాణ సౌకర్యములు, టి.వి., ఇంటర్నెట్ (అంతర్జాలం) వివిధ మీడియా మార్చివేసినవి. ఇంటర్నెట్ ద్వారా వేలాది మైళ్ళ దూరములో నున్న వారితో

సంబంధము ఏర్పరచుకొని నిర్లజ్జతలు, దుష్టత్వములు వ్యాపించ బడుచున్నవి. యువతులను మోసగించి వారి ఆచరణ స్థితుల బలహీనతలు అటుంచితే ధర్మము నుండి కూడ దూరము చేయబడును.

కొద్ది రోజుల క్రితం నాకొక విషయము తెలిసినది. పాకిస్తాన్‌లో, మరి కొన్ని ఇతర దేశములలో ఇటువంటి వార్తలు వెలువడినవి. వివాహముల పేరున మోసము చేసి అమ్మాయిలను వ్యభిచార కూపములో దించుతారు. తాత్కాలికముగా వివాహములు జరిపించి తర్వాత వ్యభిచారిణులుగా మార్చబడుదురు. ఇటువంటి పనులకు పాల్పడుచున్న వర్గము అంతర్జాతీయ స్థాయి గలది. ఈ వాస్తవాలు నిశ్చయముగా రోమాలు పొడుచుకొను విధముగానున్నవి. ఇటులనే యువకులు ఆచరణపరంగానే కాక విశ్వాసాలపరంగాను పూర్తిగా నిర్వీర్యము చేయబడుచున్నారు. అల్లాహ్ ప్రతి అహ్మదీని ఈ మలినముల నుండి రక్షించవలెనని ఒక వైపు దుఆ చేయుచు మరో వైపు ప్రతి అహ్మదీ అల్లాహ్‌తో సహాయము కోరుచు ఈ మలినముల నుండి సురక్షితముగా నుండుటకు ఒక ప్రయత్నము చేయవలసిన అవసరము గలదు. నేటి పరిశోధనలు, సౌకర్యములతో లబ్ది పొందుట నిషేధము కాదు, కాని ఈ కాలపు సౌకర్యములతో తాను లబ్ది పొందుచు ధర్మ ప్రచార సంపూర్ణతతో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం సహాయకుడు కావలెనని ప్రతి అహ్మదీ సదా గుర్తుంచుకోవలెను. నిర్లజ్జత, అధర్మము, అవిశ్వాసముతో ప్రభావితమై తనను తాను శత్రువునకు అప్పగించకూడదు.

ఇది ప్రతి అహ్మదీ కొరకు ఆలోచించు, గమనించు సందర్భము. భావి తరాలు ఈ పీడనము, దాడుల నుండి సురక్షితముగా నుండుటకు

మన పెద్దలు కూడ తమ ఆదర్శములను నెలకొల్పవలెను. నవయువకులు కూడ సాధ్యమైనంత వరకు కృషి చేయుచు అల్లాహ్‌తో సహాయము కోరుచు తమను తాము శత్రువు దాడుల నుండి రక్షించుకోవలెను. శత్రువు తెలియకుండానే దాడి చేయుచున్నాడు, వినోదము, సమయము గడుపు సాకుతో మన గృహములలో ప్రవేశించి మన జమాఅత్ యువకులను, బలహీన స్వభావము గల ప్రజలను ప్రభావితము చేయుచున్నాడు. వారిలో లోపము ఏర్పాటు చేయుటకు కూడ కృషి చేయుచున్నాడు.

నేను చెప్పినట్లు నిస్సందేహముగా అహ్మదియ్య ఖలీఫాలు ఆచరణ స్థితులను చక్కదిద్దుకోవాలని సూచించుచుండిరి. గత ఖలీఫాలు, నేను కూడ ఈ లోపమును దూరము చేయుటకు ఖుత్బాల ద్వారా అడపా దడపా సూచించుచున్నాము. మన ప్రతి స్థాయి అహ్మదీని శత్రువు దాడి నుండి రక్షించుట కొరకు ప్రయత్నించుటకు  ఈ మార్గదర్శనముల ఆధారముగా ఉప శాఖలు, జమాఅత్ వ్యవస్థ కూడ వివిధ కార్యక్రమములు చేపట్టును. కాని మనలోని ప్రతి ఒక్కరు తమ కర్మల సవరణకు స్వయాన దృష్టి సారించినచో, ధార్మిక శత్రువుల దాడులను విఫలము చేయుటకు నిలిచినచో, ఇంకా ధార్మిక శత్రువుల సవరణ కొరకు కూడ సంకల్పించి నిలిచినచో, రక్షణాత్మక ధోరణియే కాక దాడి చేసి వారిని సవరించెవలెను. ఈ ఉద్దేశమును పొందుటకు అల్లాహ్‌తో తమ ప్రత్యేక బంధమును ఏర్పరచుకొని మనము శత్రువుల దాడుల నుండి రక్షణ పొందడమే కాక శత్రువుల ఇహ, పరలోక అంతమును కూడ సవరించు వారమగుదుము. మన రాబోవు సంతానముపై దుష్ప్రభావము వేయుచున్న మోసమును కూడ అంతము చేయువారమగుదుము. మనము మన బలహీనుల విశ్వాసమును కూడ

దృఢపరచువారమగుదుము. ఈ కర్మల సవరణకు తోడు ఒకరి నుండి మరొకరికి అందుచుండును. ఈ పరంపర ప్రళయ దినము వరకు కొనసాగును. మన కర్మల సవరణ ద్వారా ప్రచార నూతన మార్గములు తెరుచుకొనును. నూతన ఆవిష్కరణలు దుష్టత్వములను వ్యాపింపజేసే బదులు ప్రతి దేశము, ప్రతి ప్రాంతములో అల్లాహ్ నామమును వ్యాపింపజేయుటకు కారణమగును.

మనము వాస్తవాల నుండి ఎన్నడు దృష్టి మరల్చలేమని గుర్తుంచుకోవలెను. ఎందుకనగా అభివృద్ధి చెందే జాతులు, ప్రపంచమును సవరించు జాతులు, ప్రపంచములో విప్లవము సృష్టించు జాతులు తమ బలహీనతలపై దృష్టి సారించును. నేత్రములు మూసుకొని అంతా సవ్యంగానే వుందని భావించినచో ఇది మన కార్యములలో అడ్డంకిగా మారును. ఏది ఏమైనప్పటికి వాస్తవాలపై మనము దృష్టి సారించవలెను. 50 శాతం లేదా ఇంత శాతం సవరణ జరిగినదని మనము సంతోషపడకూడదు. మనము ప్రపంచములో విప్లవము సృష్టించాలంటే 100 శాతం టార్గెట్ విధించుకోవలెను.

మనము కర్మల సవరణలో 100 శాతం విజయవంతులమైనచో మన జగడములు, మన వివాదములు, మన వాజ్యములు, ఒకరు మరొకరికి కల్గించే ధన నష్ట ప్రయత్నములు, ధన దాహము, టి.వి. ఇతర సాధనాల ద్వారా అసభ్యకర ప్రసారాలను తిలకించుట, ఒకరు మరొకరి గౌరవములో తగ్గుదల, ఒకరు మరొకరిని కించపరచే ప్రయత్నములు, ఈ దుష్టత్వములన్ని అంతమగును. తద్వారా ఇహలోకములోనే స్వర్గ దృశ్యమును చూపించే అనురాగము, ప్రేమ, సోదరభావ వాతావరణము ఏర్పడును. ఈ

దుష్టత్వములు ఆచరణ రూపంలో మన ముందుకు వచ్చుచుండును. జమాఅత్‌లో కూడ ఇటువంటి కొన్ని సమస్యలు వచ్చుచుండును. అందుకే నేను వీటిని ప్రస్తావించినాను. మన కర్తవ్యము ఆలోచన మనకు కలిగినప్పుడు ధర్మ సేవ అను గొప్ప ఉద్ధేశమును దైవ కృపగా భావించి చేయుదుము. నా ఈ మాటపై కొందరు మేము ధర్మ సేవను దైవ కృపగా భావించే చేయుచున్నామని అనవచ్చును. కాని వంద శాతం హోదాదారులు అలా లేరు. విశాల దృక్పథము, భరించే శక్తి హోదాదారులలో లేదని తెలిపే కొన్ని సమస్యలు నా ముందుకు వచ్చుచుండును. ఒకడు గట్టిగా ఏదైనా అన్నచో తన గర్వము, అహంభావము అవరోధముగా మారును. ఒక్కో సారి అసత్యపు ఆత్మాభిమాన ముసుగు ధరించబడును. ఒక పనిని దైవ కృపగా భావించి చేయువాడు ప్రతి విషయమును భరించును. తన గౌరవమునకు బదులు "اَلْعِزَّةُ لِلّٰهِ" పదములు అతన్ని నిరాడంబరత, వినమ్రతను పాటించుటకు బలవంతము చేయును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మనకిట్లు బోధించిరి. నేను ఆం॥హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనల పునరుజ్జీవము కొరకు వచ్చినాను. (మల్ఫూజాత్ సంపుటి 1 పుట 490 ఎడీషన్ 2003 రబ్వా) వారి సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శము మన ముందున్నది. నాతో ఎన్నడు కఠిన పదాలు లేదా కఠినముగా మాట్లాడలేదని వారి బానిస అనును. వారి సల్లల్లాహు అలైహి వసల్లం వైభవము వలన ఒక వ్యక్తి వణకడం మొదలవగానే ఇట్లనిరి. "భయపడకు, నేను ఏదో క్రూర రాజును కాదు. ఎండిన మాంసము భుజించే ఒక స్త్రీ కుమారున్ని నేను"

(సునన్ ఇబ్నె మాజ కితాబుల్ అత్‌యిమహ్, హదీస్ నెం. 3312)

ఇటువంటి ఆచరణ బహిర్గత ప్రతి హోదాదారునిచే తమ ఆచరణీయ జీవితములలో కనబర్చు అవసరమున్నది. జమాఅత్ ప్రతి కార్యకర్త తమ ఆచరణీయ జీవితములో చేయవలసిన అవసరమున్నది. ప్రతి అహ్మదీ తమ ఆచరణీయ జీవితములో చేయవలసిన అవసరమున్నది. ఏదేని పదవి లభించినచో, ఏదేని సేవ లభించినచో సదా ముహమ్మదీయ మసీహ్ ఈ ఉపదేశమును తన ముందుంచుకోవలెను. "నేను నిరుపేద, నిస్సహాయ, అపరిచితున్ని, వృత్తి రహితున్ని"

(బరాహీనె అహ్మదియ్య భాగము 5, రూహాని ఖజాయిన్ సంపుటి 21 పుట 20)

కనుక మనము మన ఆచరణీయ స్థితులలో నిస్సహాయత, బీదత్వము, వృత్తి రహితను బహిర్గతపరచి నప్పుడే సేవా హక్కు చెల్లించబడును. "దీనితోనే స్వర్గములో ప్రవేశించెదము కాబోలు" ను ఆశించువారమగుదుము. (బరాహీనె అహ్మదియ్య భాగము 5, రూహాని ఖజాయిన్ సంపుటి 21 పుట 20) ఇది లేనిచో ఈ కాలపు ఇమామ్‌ను నమ్మినామని మనము ప్రటకన వరకు మాత్రం సరితూగవచ్చును. కాని వాస్తవ రూపంలో మనము ప్రకటనను అపహాస్యము చేయువారమగుదుము. ఏ ఇతరుని శత్రుత్వము మనకు నష్టము కలిగించలేదు. కాని మన ఆత్మ ద్వంధ వైఖరి మనలను అవమానపరచును. అల్లాహ్ అసంతృప్తి దీనికి అదనంగా కలుగను.

జమాఅత్ సేవకు నియమించబడిన వ్యక్తి ప్రత్యేకముగా ఆత్మపరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది. సాధారణముగా ప్రతి అహ్మదీ తమ ఆత్మ పరిశీలన చేసుకోవలెను. ఎందుకనగా బైఅత్ (ప్రతిజ్ఞ) హక్కు కేవలం నోటీ ప్రకటనలతో, నమ్మడంతో మాత్రమే పూర్తి కాదు. ఆచరణ శక్తి ప్రకాశించనంత వరకు ఎలాంటి ప్రయోజనము లభించదు. ❖

③

# ఖుత్బా జుమా సారాంశము : 13 డిశంబర్ 2013

## కర్మల సవరణకు అవరోధముగా నున్న కారణములు

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఏదేని వస్తువును చక్కదిద్దుట లేదా దానిని సంస్కరించు వివిధ కారణాలను అవలంభించుటకు దాని లోపమునకు గల కారణాలను తెలుసుకున్నప్పుడే సాధ్యమగును. ఆ కారణములు తెలిసినప్పుడు వాటిని అంతమొందించుటకు ప్రయత్నము చేయబడును. కారణము మిగిలియున్నచో తాత్కాలిక సవరణ తర్వాత, మరల ఆ దుష్టత్వము తిరిగి వచ్చును. ఈ కోణములో నేను ఆలోచించినాను. మరింత చదివినాను. అప్పుడు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఒక పరిశీలన నాకు లభించినది. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు వ్యాస, ఉపన్యాస పద్ధతి విశిష్టత ఏమనగా సాధ్యమైన ప్రశ్నను తానే వెలికితీసి, దాని పరిష్కారమును కూడ ఉదాహరణలతో వివరింతురు. ఖుర్ఆన్, హదీస్, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వాక్యముల ఆధారముగా వారు పరిష్కరించే సమస్యలు ఈ విధముగా ఎక్కడా దర్శనమివ్వవు. కనుక ఏది ఏమైనప్పటికి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఖుత్బాలతో లబ్ది పొందుచు, వాటి ఆధారముగా ఆయా కారణములను కూడ మీ ముందు ప్రవేశపెట్టెదను.

కర్మల సవరణకు అవరోధముగా ఏర్పడే లేదా ప్రభావితము చేసే విషయములలో మొట్టమొదటి విషయము ఒక దానిని చిన్న పాపముగా

మరొక దానిని పెద్ద పాపముగా ప్రజలు భావించుట. అనగా ప్రజలు స్వయాన లేదా తమ పండితుల మాటలలో పడి వారి ప్రభావము వలన కొన్ని పాపములు చిన్నవి, కొన్ని పెద్దవని నిర్ణయించుకొనిరి. ఈ విషయమే కర్మల సవరణకు అవరోధముగా మారుచున్నది. దీనితో మానవునిలో పాపము చేయుటకు ధైర్యము, సాహసము కలుగును. దుష్టత్వములు, పాపముల ప్రాముఖ్యత యుండదు. చిన్న పాపము చేయుటలో ఎలాంటి అభ్యంతరముండదు లేదా దానికి అంత శిక్ష యుండదని వీరు భావింతురు.

(ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 17 పుట 339, ఖుత్బా జుమా 29 మే 1936)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

"ఎవరైనా అనారోగ్యమునకు గురైనచో అతని వ్యాధి చిన్నదైనను లేదా పెద్దదైనను, అతని వ్యాధికి చికిత్స చేయనిచో, చికిత్స కొరకు కష్టపడనిచో రోగికి స్వస్థత కలుగదు. ఒక నల్లటి మచ్చ ఏర్పడి ఇది పెరుగుచు మొత్తం ముఖమును నల్లగా చేయునని ఎంతో కలతకు గురి చేయును. ఇదే విధముగా పాపపు ఒక నల్ల మచ్చ కూడ హృదయములో ఏర్పడును. సఘాయిర్ "అనగా చిన్న పాపములు" విస్మరించబడినచో అవి కబాయిర్ "అనగా పెద్ద పాపములు" గా మారును. అల్పమైన మచ్చ పెరుగుచు క్రమేణ మొత్తం ముఖమును నల్లగా చేయును".

(మల్ఫూజాత్ సంపుటి 1 పుట 7 ఎడిషన్ 2003 ముద్రణ రబ్వా)

ఏ పాపమును కూడ మానవుడు చిన్నదిగా భావించకూడదు. ఎందుకనగా ఇది చిన్న పాపమని ఆలోచన కలిగినప్పుడు వ్యాధి బీజము వృధా అగును. సందర్భానుసారము ఈ చిన్న పాపములు కూడ పెద్ద పాపములగును. ఈ విధముగా మనమందరము మన ఆత్మ పరిశీలన

చేసుకోవలసిన అవసరముంది. అల్లాహ్ ప్రతి చిన్న పాపము, పెద్ద పాపమునకు కూడ జవాబుదారితనము, శిక్ష విధించియున్నాడు.

తప్పుడు పనులపై డబ్బులు వృధా చేయుట ఒక చెడు వ్యసనము, ఇది నిషేధించబడెను. ఈ రోజులలో జూదపు యంత్రములున్నవి. వివిధ రకములైన జూదములున్నవి. అనేక మంది లాటరీలను కూడ చాలా ఇష్టపడుదురు. జూదపు యంత్రము వద్దకు పోవుదురు, జూదమాడుదురు. కాని సాధారణ జీవితములో అబద్ధమాడరు. సామాన్య ప్రజలను హింసించరు, హతమార్చరు. ఎందుకనగా వారీ దుష్టత్వములను పెద్ద పాపములుగా భావింతురు. కాని జూదము, తప్పుడు పనులలో డబ్బును వృధా చేయడమును తప్పుగా భావించరు. కనుక ఇటువంటి వ్యక్తి కొరకు తప్పుడు మార్గములో డబ్బును వృధా చేయుట మహా పాపమగును. ఎందుకనగా ఇతర పాపములను అతడు ముందే పాపముగా భావించుచున్నాడు.

ఒక స్త్రీ తమ దుస్తులను లజ్జతో కూడినవిగా ధరించనట్లు మనము చూచెదము. బయటకి వెళ్లినప్పుడు ముసుగును ధరించదు. అహ్మదీ ముస్లిం అయినను, అనబడినను తలపై ఏమి ధరించకుండా, ముసుగు లేకుండా, స్కార్ఫ్ లేదా చున్నీ లేకుండా విహరించును. వస్త్రధారణ బిగుసుగా, శరీరమును ప్రదర్శించు విధముగా నుండును. కాని ధన త్యాగము గురించి చెప్పబడినచో ఏదేని స్వచ్ఛంద సంస్థలో చందా ఇవ్వమని చెప్పబడినచో విశాల హృదయముతో చెల్లించును. అసత్యముతో ద్వేషముండును. ఎవరైనా అసత్యమాడినచో వారు భరించరు. చందాలు పెంచుట కాదు, అబద్ధము నుండి దూరముండుట కాదు, తమ దుస్తులను సభ్యత, సంస్కారముగా వుంచు, ముసుగు ధరించు పవిత్ర ఖుర్ఆన్ ఆజ్ఞను పాటించుట ఆమె

కొరకు పెద్ద సత్కార్యమగును. ఆమె చిన్న సత్కార్యమని దాని వైపు దృష్టి సారించడం లేదు. అదే తర్వాత పెద్ద దుష్టత్వము వైపు తీసుకెళ్లును. అనగా ప్రతి సత్కార్యపు, దుష్కార్యపు ప్రమాణము ప్రతి వ్యక్తి స్థితిని బట్టి యుండును. వివిధ స్థితులలో వివిధ ప్రజల ఆచరణను బట్టి పుణ్య, పాప నిర్వచనము వారి కొరకు మారును.

ఫలానా పాపము పెద్దది, ఫలానా పాపము చిన్నది, ఫలానా పుణ్యము చిన్నది, ఫలానా పుణ్యము పెద్దదను భావము వున్నంత వరకు మానవుడు పాపముల నుండి దూరముండలేడు, అటులనే పుణ్యములు చేయు అనుగ్రహము పొందలేడు. మానవుడు వీడలేని చిన్న పాపములే పెద్ద పాపములని మనకు సదా గుర్తుండవలెను. అవి మానవుని అలవాట్లలో చేరి వీడుట కష్టతరమగును. మానవుడు చేయుటకు కష్టముగా భావించదగినవే పెద్ద పుణ్యములని భావించవలెను. అనేక దుష్టత్వములు కొందరి కొరకు పెద్దవి, మరి కొందరి కొరకు చిన్నవిగా నుండును. అనేక సత్కార్యములు కొందరి కొరకు పెద్దవి, మరి కొందరి కొరకు చిన్నవిగా నుండును.

## ✡ మొదటి కారణము

మనము మన సవరణ చేయదలచినచో మొట్ట మొదటగా మనము వ్యభిచారము ఒక పెద్ద పాపము, హత్య ఒక పెద్ద పాపము, దొంగతనము ఒక పెద్ద పాపము, చాడీలు చెప్పుట ఒక పెద్ద పాపము. ఇవి గాక ఇతర పాపములు చిన్నవను అభిప్రాయమును మన హృదయముల నుండి తీసివేయవలెను. కనుక ఈ అభిప్రాయమును హృదయము నుండి తొలగించవలెను. సామాన్య ముస్లిముల హృదయములలో ఆలోచన

యున్నట్లు అనగా ఉపవాసము పెద్ద పుణ్యము, జకాత్ పెద్ద పుణ్యము, హజ్ పెద్ద పుణ్యము, ఇవి గాక ఇతర పుణ్యములు చిన్న పుణ్యములనే ఆలోచన కూడ హృదయము నుండి తొలగించవలసిన అవసరమున్నది. ఈ ఆలోచన హృదయము నుండి తీసివేయనిచో ఆచరణ భాగము బలహీనంగా యుండును. పవిత్ర ఖుర్ఆన్ ఏడు వందల ఆదేశములను పాటించని వాడు మోక్షపు ద్వారమును తన కొరకు మూసివేసుకొనను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఉపదేశమును మనము మన ముందుంచు కొన్నప్పుడు ఆచరణ భాగము దృఢమగును. కనుక మనము ఇతరుల వలె కొన్ని పుణ్యములు పెద్దవి, కొన్ని పాపములు చిన్నవని భావించకూడదు. ఈ సమస్యలో వారు అనగా ఇతర ముస్లిములు ఎంత వరకు హద్దులు దాటినారనగా ఉదా॥ ఉపవాసము పెద్ద పుణ్యమని భావింతురు. కాని సామూహిక నమాజ్ ప్రాధాన్యత ఏమి యుండదు. కాని ఉపవాసము చాలా ముఖ్యమైనది. దానిని ఎంతగానో పాటింతురు. జకాత్ ఎవరిపై విధించబడినదో అతడు జకాత్ నుండి తప్పించుకొనును, కాని ఉపవాసము తప్పక యుండును. అతడు ఉపవాసము యుండనిచో అతని దృష్టిలో అది పెద్ద నేరమగును.

ప్రతి పుణ్యమును అవలంభించి, ప్రతి పాపము నుండి దూరముండుటకు ప్రయత్నించవలెనను విషయమును సదా మనము గుర్తుంచుకున్నప్పుడే మనము మనలను సంస్కరించుకోగలము.

## ✡ రెండవ కారణము

సమాజము లేదా నకలు చేయు స్వభావము కర్మల సవరణకు రెండవ అవరోధ కారణముగా మారును. మానవుని స్వభావములో నకలు చేయు

బీజమును అల్లాహ్ కలిగించెను. అది బాల్యము నుండే ప్రత్యక్ష్యమగును. ఈ స్వభావము నిశ్చయముగా మన ప్రయోజనము కొరకే యున్నది. కాని దీని దురపయోగము మానవున్ని నాశనము చేయును లేదా నాశనము వైపు కూడ తీసుకెళ్లును. నకలు లేదా పరిసరాల ప్రభావము వల్లనే మానవుడు తమ తల్లి, దండ్రులతో భాషను నేర్చుకొనును. లేదా ఇతర పని నేర్చుకొనును, మంచి విషయములను నేర్చుకొనును. మంచి విషయములను నేర్చుకొని బాలుడు సద్గుణముల వాడగును. తల్లిదండ్రులు సత్కార్యులు, నమాజ్ చదివేవారు, ఖుర్ఆన్ చదివేవారు, ఖుర్ఆన్ పఠించేవారు, పరస్పరము ప్రేమానురాగముతో యుండువారు, అసత్యమును ద్వేషించేవారు అయినచో పిల్లలు కూడ వారి ప్రభావము వలన సత్కార్యములను అవలంభించు వారగుదురు. కాని అసత్యము, వివాదము, ఇంట్లో ఇతరులను అపహాస్యము చేయు మాటలు మాట్లాడుట, జమాఅత్ గౌరవమును పాటించక పోవడం లేదా ఇటువంటి దుష్టత్వములను బాలుడు చూచినప్పుడు నకలు చేయు అతని స్వభావము లేదా పరిసర సమాజపు ప్రభావము వలన ఇటువంటి దుష్కార్యములను నేర్చుకొనును. బయటికి వెళ్లినప్పుడు సమాజములో, మిత్రులలో చూచి దానిని నేర్చుకొనుటకు ప్రయత్నించును. అందుకే తమ పిల్లల బయటి సమాజమును కూడ పర్యవేక్షించాలని నేను తల్లిదండ్రులకు పదే పదే సూచించుచుందును. గృహములో కూడ వారు తిలకించే టి.వి. కార్యక్రమము, వారు ఉపయోగించే ఇంటర్నెట్‌ను గమనించుచుండవలెను.

బాలల శిక్షణ వయసు అతి చిన్నతనములోనే ప్రారంభము కావలెనను విషయము కూడ గుర్తించదగినదే. బాలుడు పెద్ద వాడైనప్పుడు శిక్షణ మొదలగునని ఆలోచించకూడదు. రెండు సంవత్సరములు, మూడు

సంవత్సరముల వయసు కూడ బాలల శిక్షణ వయసే. నేను తెలిపినట్లు బాలుడు గృహములో తల్లిదండ్రులు, పెద్దలతో నేర్చుకొనును. వారిని చూచి వారిని అనుసరించును. ఇంకా బాలుడు చిన్నవాడే, అతనికేమి తెలియుదను విషయము తల్లిదండ్రులు ఊహించకూడదు. అతనికి ప్రతి విషయము తెలియును. తల్లిదండ్రుల ప్రతి కదలికను చూడును. అనుకోకుండానే అది అతని మెదడులో పాతుకుపోవును. ఒక కాలమునకు చేరుకొని వారిని అనుసరించడం ప్రారంభించును. అమ్మాయిలు తల్లుల అనుసరణలో ఆటలలో తల్లుల వలె దుస్తులు ధరించి వారిని అనుసరించుటకు ప్రయత్నింతురు. అబ్బాయిలు తండ్రులను అనుసరింతురు. తల్లిదండ్రులలో నున్న సత్కార్యములు, దుష్కార్యములను వారు నకలు చేయుదురు. ఉదా॥ వారు యుక్త వయసుకు చేరినప్పుడు వారికి ఇవి దుష్కార్యములు, ఇవి సత్కార్యములు అని బోధించబడును. ఉదా॥ అసత్యమున్నది, దీనిని పలుకుట మంచిది కాదు. వాగ్దానమును పూర్తి చేయుట మంచిది. కాని సత్యము పలుకుటలో తల్లిదండ్రుల గొప్ప ప్రమాణము చూడని బాలలు, తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలచే వాగ్దానము పూర్తి చేయుటను చూడని బాలుడు బోధనపరంగా అసత్యమాడుట మంచిది కాదని, వాగ్దానమును పూర్తి చేయుట సత్కార్యము, మంచిదని నిస్సందేహముగా భావింతురు, కాని ఆచరణలో అలా చేయరు. ఎందుకనగా వారు గృహములో ఇందుకు విరుద్ధముగా ఆచరణ చూచెదరు. పిల్లల అలవాట్లు బాల్యము నుండే పరిపక్వత చెందును. కనుక వారు పెద్దగై దానిని అంగీకరించరు. నమాజ్‌లో అలసత్వము వహించినట్లు తల్లిని బాలుడు చూడును. తండ్రి ఇంటికి వచ్చి నమాజ్ చేసినావా అని అడిగినప్పుడు లేదు ఇంకా చేయలేదని సమాధానము

ఇవ్వబడినప్పుడు ఈ సమాధానము చాలా మంచిదని బాలుడు భావించును. నన్ను కూడ ఎవరైనా అడిగినచో నేను ఇదే సమాధానము అనగా ఇంకా చదవలేదు, చదువుతానని సమాధానమిత్తును. మరచిపోయినాననే సమాధానము వినును, చదివినాను అని వినును. రోజంత తల్లితో వున్నందున తల్లి నమాజ్ చదవలేదని బాలునికి తెలుసు. అప్పుడు బాలుడు ఆ సమాధానమును గుర్తుంచుకొనును. ఇటులనే తండ్రి తప్పుడు విషయములు బాలుని మెదడులో పాతుకుపోవును. వాటికి తండ్రి తప్పుగా ఇచ్చే సమాధానములు కూడ బాలుడు మెదడులో వుంచుకొనును. తల్లిదండ్రులిరువురు బాలుని శిక్షణ పరంగా తప్పుడు శిక్షణ ఇచ్చుచున్నచో లేదా తప్పుడు కర్మలు చేయుచున్నచో అతన్ని తప్పుడు మార్గము వైపు తీసుకపోవుచున్నారు. తమ ఆచరణతో అతనికి తప్పుడు బోధన ఇచ్చుచున్నారు. బాలుడు యవ్వనమునకు చేరుకొని ఇదే చేయును, ఆచరణలో ఇదే సమాధానమిచ్చును.

ఇటులనే ఇరుగు పొరుగు, తల్లిదండ్రుల స్నేహితురాళ్లు, మిత్రుల తప్పుడు కర్మల ప్రభావము కూడ బాలల పై పడును. కనుక తర్వాతి తరాల కర్మల సవరణ ప్రమాణము గొప్పగా యుండవలెనని ఆశించినచో తమ సంతానము, తమ పిల్లల నిజమైన కర్మల సవరణ కోరినచో తల్లిదండ్రులు తమ స్థితిగతులపై కూడ దృష్టి సారించవలెను. కర్మల పరంగా గుణవంతులైన వారితోనే తమ మిత్రుత్వమును ఏర్పాటు చేసుకోవలెను.

❖

④

# ఖుత్బా జుమా సారాంశము : 20 డిశంబర్ 2013

## ✡ మూడవ కారణము

కర్మల సవరణకు మూడవ అవరోధము తక్షణమే లేదా సమీప విషయములకు ప్రాధాన్యతనిచ్చుట. విశ్వాసపు విషయములు దూరమైనవి. ఈ విషయములు తర్వాతి జీవితమునకు సంబంధించినవి. నేను చెప్పినట్లు ఆచరణాత్మక విషయములు తక్షణముకు సంబంధించి యుండును. లేదా బాహ్యములో విశ్వాసముతో వీటికి సంబంధం లేదని మానవుడు భావించును. నేనేదేని తప్పుడు పని చేసినచో దీని వలన దేవుని ఏకత్వ విశ్వాసమునకు ఎలాంటి తేడా రాదు. ఉదా॥ కమసాలి వున్నాడు. నేను బంగారములో కల్తి చేసినచో దేవున్ని నమ్మే విషయములో ఎలాంటి తేడా రాదు. కాని నా ఆదాయము పెరుగునని అతడు భావించును. త్వరగా లేదా అధిక నగదు, ఆదాయము పొందేవాడినగుదును.

## ✡ నాలుగవ కారణము

కర్మల సవరణకు నాలుగవ అవరోధము కర్మలకు అలవాటుతో నున్న సంబంధము. అలవాటు వలన ధర్మముతో పాటు ప్రభుత్వము లేనప్పుడు ప్రత్యేకముగా బలహీనతలు పుట్టును. అనగా ప్రభుత్వ చట్టముల వలన కొన్ని ఆచరణీయ సవరణలు జరుగును. కాని దురదృష్టవశాత్తు ఇస్లాంలో ఏ విషయములను సత్ప్రవర్తనల దిగజారుడుతనము అనబడునో,

వాటి సంస్కరణకు ఇస్లాం సూచించునో వాటిలో ముస్లిం దేశములలో న్యాయము కనిపించనందున, ద్వంధ వైఖరి వలన, ముస్లిం ప్రభుత్వమైనను ముస్లిం దేశములలో ఆచరణీయ స్థితి చాలా విచారించదగ్గది. ముస్లిమేతర దేశములలో కొన్ని విషయములను సంస్కరించుట అనివార్యమగును. వారు వాటిని దుష్కార్యము లేదా ప్రవర్తనల దిగజారుడుతనముగా భావించరు. కనుక కొన్ని విషయములను ఆచరణలో సంస్కరించుట సాధ్యము కాదు.

కనుక ఆచరణీయ సంస్కరణ కొరకు ప్రభుత్వము ఒక పాత్ర పోషించును. ధర్మము, ప్రభుత్వము కర్మల సవరణ ఒకే పదమునకు నిర్వచనమైనప్పుడు కర్మల సవరణ దాని ప్రకారముండును. అక్కడ చట్టముల వలన అలవాట్లు అంతము చేయబడవు. కాని ప్రభుత్వ చట్టము ఆచరణీయ సంస్కరణకు సహాయపడని చోట అలవాట్లను మార్చలేము. ఆచరణీయ బలహీనతలు సమాజములో కేన్సర్‌గా మారును. ఉదా॥ స్వేచ్ఛ పేరిట అభివృద్ధి చెందిన దేశములలో మనము అనేక ఆచరణీయ బలహీనతలను చూచెదము. ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఇప్పుడు ఆచరణీయ బలహీనతలను ప్రపంచమంతటా వ్యాపింపజేయడం జరుగుతుంది. ఇటువంటి సమాజములో యుండేవారు, సమాజపు భాగమైనందున, సదా వాటిని తిలకించుచు అలవాటుగా పలు ఆచరణీయ బలహీనతలను అవలంభించినారు. తెలియకనే, అనుకోకుండా పిల్లలు లేదా యువకులు, అబ్బాయిలు, అమ్మాయిలలో కూడ ఈ బలహీనతలు పాతుకుపోయినవి. అలవాటు గట్టిపడినప్పుడు దానిని వీడుట కష్టమగును. ఒక వ్యక్తి ముగ్గురు దేవుళ్ల బదులు ఒక్క దేవున్ని నమ్మే త్యాగము చేయును. ఒక్క దేవున్ని నమ్మిన తర్వాత రెండవ రోజు ముగ్గురు దేవుళ్ల ఆలోచన అతనికి ఎప్పటికి కలుగదు.

కాని మత్తు చేసే వాని హృదయములో మత్తు లభించవలెననే ఆలోచన మాత్రం తప్పక కలుగును. జీవితాంతం నున్న ఒక విశ్వాసమును మానవుడు వీడవచ్చును. కాని కొన్ని నెలల లేదా కొన్ని సంవత్సరముల అలవాటు అయిన మత్తు అలవాటులో కొంతైనా కొరత ఏర్పడినచో అతడు భరించలేడు. సిగరెట్ త్రాగే వారు కూడ కొందరు తమ వంశములను, తమ సోదరీ, సోదరీమణులను, తమ తల్లిదండ్రులను, తమ భార్యాపిల్లలను వీడి జమాఅత్‌లో చేరిరి. త్యాగమిచ్చి వారు అహ్మదీయులైరి. కాని సిగరెట్ వీడమని చెప్పినచో వంద సాకులు వెతుకుతురు. ఒకని కడుపు వుబ్బుతుంది. మత్తు చేయనిదే మరొకనికి నిద్ర పట్టదు. ఒకని దృష్టిలో అతని ఆలోచనా శక్తులు అంతమగును. అందుకు వారు కలత చెందుచుందురు. ఇవి అహ్మదియ్య జమాఅత్‌లో చేరినవారికి మాత్రమే కాదు. ప్రతి ఒక్క వ్యక్తికి చెందినవి. కొందరు ఎన్నో సత్కార్యములు చేయుదురు, పెద్ద పెద్ద త్యాగములు సమర్పింతురు. కాని చిన్న అలవాటును వీడలేరు.

## ✡ ఐదవ కారణము

కర్మల సవరణకు ఐదవ అవరోధము భార్యాపిల్లలు. వీరు కర్మల సవరణలో అడ్డంకిగా మారుదురు.

(మాఖూజ్ అజ్ ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 17 పుట 375, ఖుత్బా జుమా 12 జూన్ 1939)

కొన్ని సందర్భాలలో భార్యాపిల్లల బాధలు మానవున్ని ఇబ్బందులలో నెట్టివేయును. ఉదా॥ ఒకరి ధనమును వశపరచుకోకూడదని ఇస్లాం బోధన. ఒకడు ఒకని వద్ద ఏదేని నగదు న్యాసముగా వుంచెను. కాని అందుకు ఎవరు సాక్ష్యముగా లేరు, ఎటువంటి నిదర్శనము లేదు. న్యాసము వుంచబడిన

వ్యక్తి ఉద్ధేశములో తమ భార్యా పిల్లల అవసరముల వలన మోసపూరిత ఆలోచన కలుగును. ఉద్ధేశము చెడిపోవును. నా భార్య నాతో కొంత నగదు అడిగెను, నేను ఆమెకు ఇవ్వలేక పోతినని అతనికి ఆలోచన కలుగును. ఇప్పుడు అవకాశము వచ్చెను. ఈ నగదును ఉపయోగించి నేను నా భార్యా పిల్లల అవసరాలను పూర్తి చేయగలను. లేదా కుమారుని వ్యాధి వలన చికిత్సకు నగదు అవసరమున్నది. నగదు లేదు. ఈ న్యాసముతో లబ్ది పొంది, ఈ నగదును వినియోగించి అతనికి చికిత్స చేయింతును. నగదు ఇవ్వవలెనా లేదా అనే విషయమును తర్వాత చూద్దాం. భార్యా, ప్లిలలకు సంబంధించిన మరో ఉద్ధేశము కొరకు మానవుడు ఇతరుని ధనమును వశపరచుకొనును. ఇది కేవలము ఆర్థిక సమస్యలకు మాత్రమే పరిమితం కాదు. ఈ ఉదాహరణలే కావు. ఈ స్వాతంత్ర్య, ప్రగతి చెందిన సమాజములో కొందరు తల్లిదండ్రులు ప్రత్యేకముగా అలవాటుగా ఇలా చేయుదురు. కాని పేద దేశములలో కూడ పిల్లలను గారాబము వలన ఇస్లాం బోధనకు కట్టుబడి యుండేటట్లు చేయని విషయములు సంభవించుచున్నవి. నేను ప్రస్తావించుచున్న ఈ విషయముల ను విచారముతో చెప్పుచున్నాను. మన అహ్మదీ సమాజములో కూడ అప్పుడప్పుడు బహిర్గతమగుచున్నవి. ఒకడు మరొకని న్యాసమును వశపరచుకొనును. ఒకడు మరొకనిని మరో విధముగా మోసము చేసెను. ఒకడు అనాథ ధనమును పూర్తిగా చెల్లించు హక్కు చెల్లించలేదు. ఖజా (న్యాయ వ్యవస్థ)లో ఇటువంటి పలు సమస్యలు, ఫిర్యాదులు వచ్చును. ధనిక దేశములలో నివసించువాడు తన కూతురి వివాహము పాకిస్తాన్‌లో చేయును. అల్లుడికి మొదటి రోజే నేను నా కూతుర్ని ఎంతో గారాబంగా పోషించినాను, ఆమెకు అన్ని రకాల స్వాతంత్ర్యమిచ్చినాను, కనుక ఆమెపై

ఎలాంటి ఆంక్షలు విధించకూడదని అనును. కూతురి మెదడు తండ్రి కనుసన్నల్లో ఆకాశానికెక్కును. భర్తను ఆమె అసలు లెక్క చేయదు. భార్య తన భర్త హక్కులు చెల్లించుచు, తన ఇంటి బాధ్యతలను నిర్వర్తించవలెనని ఇస్లాం బోధనలో గలదు. ఇది ఆమె కర్తవ్యములలో భాగము. ఒక్కోసారి అబ్బాయిలు పాకిస్తాన్ నుండి అమ్మాయిలను వివాహమాడి తీసుకొత్తురు. అమ్మాయిని క్రూరముగా హింసింతురు. అమ్మాయి సర్వము భరించవలెను, అబ్బాయిలు ఈ విధముగానే యుందురని అబ్బాయి తల్లిదండ్రులందురు. ఈ పిల్లల గారాబము తల్లిదండ్రుల ఆచరణ స్థితిని నాశనము చేయుటయే కాక సంసారములను కూడ నాశనము చేయును.

## ✡ ఆరవ కారణము

కర్మల సవరణలో ఆరవ అవరోధము ఏమనగా మానవుడు వరుసగా తనను పర్యవేక్షించడు. అనగా కర్మలను ప్రతిక్షణం గుర్తుంచుకోవలెను. అప్పుడే సవరణ సాధ్యమగును.

(మాఖూజ్ అజ్ ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 17 పుట 380,
ఖుత్బా జుమా 12 జూన్ 1939)

ఈ కార్యపు ఫలితములు పుణ్యమైనవా కావా, ఈ పనిని చేసే అనుమతి నాకు యున్నదా లేదా అని ప్రతి పని చేసే ముందు ఆలోచించ వలసిన అవసరముంది. పవిత్ర ఖుర్ఆన్ ఏడు వందల ఆజ్ఞలను పాటించుమను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఉపదేశమును పాటించుచున్నానా లేదా. నేను వాటితో దూరము కావడం లేదు కదా! ఉదా॥ నిజాయితితో పని చేయుట ఒక ఆజ్ఞ. ఒక దుకాణాదారునికి కూడ ఈ ఆజ్ఞ గలదు. ఒక కూలీ పని చేసేవానికి కూడ ఈ ఆజ్ఞ గలదు.

నిజాయితిగా వ్యవహరించుమని ప్రతి ఒక్కరికి తమ తమ పరిధిలో ఆజ్ఞ గలదు. ఒక దుకాణాదారుని ముందు నిజాయితిగా వ్యవహరించుమను ఆజ్ఞ అనేక సార్లు వచ్చును. ఒక అపరిచితుడైన కొనుగోలు దారుడు వచ్చినప్పుడు అతనికి తక్కువ నాణ్యత గల వస్తువు ఇచ్చి అధిక ధర వసూలు చేయును. లేదా నిర్ణీత ధరలోనే తక్కువ తూకముతో ఇచ్చివేయును. ఒక అహ్మదీ దుకాణాదారుని నాణ్యత ఎల్లప్పుడు మంచిగా యుండవలెను. వారి తూకము పూర్తిగా యుండవలెను. ఏదేని లోపమున్నచో కొనుగోలుదారుని దృష్టికి ఆ లోపము తేవలెను. లాభము సమంజసము, తక్కువ యుండవలెను. దీని ద్వారా ఇన్షాఅల్లాహ్ వ్యాపారములో శుభము కలుగును, తరుగుదల ఏర్పడదు. ఇదే విధముగా ప్రతి శాఖకు చెందిన అహ్మదీయుడు తమ నిజాయితి అందమును బహిర్గతము చేయవలసిన అవసరమున్నది.

## ✡ ఏడవ కారణము

మానవుని సంబంధాలు, ప్రవర్తనలు కర్మల సవరణలో పైచేయి సాధించి అవరోధముగా మారును. దైవభీతిలో తగ్గుదల ఏర్పడును.

(మాఖూజ్ అజ్ ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 17 పుట 380,
ఖుత్బా జుమా 12 జూన్ 1939)

కొన్ని సార్లు ఆశ, మిత్రుత్వ సంబంధములు, బంధుత్వములు, జగడము, కోపము, కుట్రలు కర్మల మంచి భాగాలను ప్రత్యక్షము కానివ్వవు. ఉదా॥ నేను న్యాసమును ఉదహరించినాను. మరల తెలిపెదను. అల్లాహ్ ఆజ్ఞాపించినాడనే కోణములో మానవుడు న్యాసమును చూడడు. తన మిత్రులలో లేదా శత్రువులలో ఎటువంటి ప్రభావము పడుననే కోణములో న్యాసమును చూడును. ఇటులనే సత్యమును అల్లాహ్ ఆజ్ఞాపించినాడనే

కోణములో చూడడు. అతనికి లేదా అతని మిత్రులకు, చిరంజీవులకు ఈ సత్యము పలుకడంతో ఎటువంటి నష్టము వాటిల్లునా అనే కోణములో అతడు ఆలోచించును. ఫలానా సమయమున నాకు అతడు నష్టము కలిగించెనని, నేడు నాకు ప్రతీకారము తీర్చుకునే అవకాశము లభించెను, కనుక అతనికి వ్యతిరేకముగా సాక్ష్యమిత్తునని ఇతర వ్యక్తికి వ్యతిరేకముగా సాక్ష్యమిచ్చును. దైవ భీతి తగినంత లేనందున కర్మలలో బలహీనత ఏర్పడును.

## ✡ ఎనిమిదవ కారణము

కర్మల సవరణలో ఎమిదవ అవరోధము ఏమనగా కుటుంబ సంస్కరణ కానిదే కర్మల సవరణ చాలా కష్టమగును.

(మాఖూజ్ అజ్ ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 17 పుట 380,
ఖుత్బా జుమా 12 జూన్ 1939)

ఉదా॥ భార్యాపిల్లలు పూర్తిగా సహకరించనిదే నీతి, నిజాయితి పూర్తి కాదు, లేదా సంపూర్ణ ప్రమాణమును పొందలేరు. కుటుంబ యజమాని ఎంత ధర్మబద్ధముగా సంపాదించినా అతని భార్య ఏదేని రకముగా పొరుగువారిని దోచుకొనినా, ఏదో రకముగా నష్టము కలిగించినా, ధనమును దోచుటకొనుటకు ప్రయత్నించినా లేదా అతని కుమారుడు లంచముతో వచ్చిన ధనమును ఇంటికి తెచ్చినా ఆ కుటుంబ ఆదాయము ధర్మబద్ధమైనది కాదు. ప్రత్యేకముగా కుటుంబము వారు మొత్తం ఒక చోట యుండేవారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, వారి కుటుంబము ఉమ్మడిగా కొనసాగును. ఇదే విధముగా ఇతర కర్మలున్నవి. కుటుంబము వారందరి కర్మలను ఒక్కటై సరిదిద్దుటకు ప్రయత్నము చేయనంత వరకు, ఏదో ఒక సందర్భమున ఒకరు మరొకరిని ప్రభావితము చేయును. భార్య పుణ్యస్త్రీ కాగా భర్త ధర్మబద్ధ

ఆహారము సంపాదించనప్పుడు కూడ కుటుంబము ప్రభావితమగును. నమాజుల వైపు తండ్రికి శ్రద్ధ యున్నది, కాని పిల్లలకు సూచించనప్పుడు లేదా తండ్రి సూచించును కాని తల్లి సూచించదు. లేదా తల్లి సూచించును కాని తండ్రి నమాజ్ చదవనిచో పిల్లలు అతన్ని నకలు చేయుదురు. గత ఖుత్బాలో కూడ నేనీ ఉదాహరణలు ఇచ్చినాను. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను. قُوا أَنفُسَكُمْ وَأَهْلِيكُمْ نَارًا (అత్తహ్రీమ్: 66) తమను తాము మాత్రమే నరకము నుండి రక్షించుకొనుటయే కాదు తమ భార్యా, పిల్లలను కూడ రక్షించుము. నరకపు అగ్ని నుండి తమను తాము రక్షించుకొనుట సరిపోదు. ఇతరులను కూడ రక్షించుట కర్తవ్యము. ఇతరులను రక్షించనిచో ఏదో ఒక రోజు వారు మిమ్ములను కూడ తీసుకొని మునిగెదరు.

ఈ ఎనిమిది అవరోధములే కాక మరికొన్ని విషయములు కూడ ఆచరణాత్మక సవరణకు అవరోధముగా నుండవచ్చును. ఇవి నేను చెప్పిన కొన్ని విషయములు. కాని గ్రహించినచో అన్ని విషయములు ఈ ఎనిమిది విషయముల పరిధిలోకే వచ్చును.

❖

⑤

# ఖుత్బా జుమా సారాంశము : 10 జనవరి 2014

## ఆచరణ సవరణకు మూడు విషయములు అవసరము

## (1) సంకల్ప శక్తి (2) విద్యా శక్తి (3) ఆచరణ శక్తి

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు చాలా అద్భుతముగా ఇట్లు వివరించినారని హుజూర్ అనిరి. ఆచరణీయ సవరణకు మానవునిలో ఈ విషయములు కలిగినప్పుడే విజయము లభించవచ్చును. ఈ మూడు విషయములు ఇట్లు గలవు. ఒకటి సంకల్ప శక్తి, రెండవది సరియైన, సంపూర్ణ విద్య, మూడవది ఆచరణ శక్తి. కాని అసలు ప్రాథమిక శక్తులు రెండు. సంకల్ప శక్తి, ఆచరణ శక్తి. ఈ రెండింటి మధ్య వుంచబడినది అనగా సరియైన, సంపూర్ణ విద్య. ఇది ప్రాథమిక రెండు శక్తులపై ప్రభావితమగును. సరియైన విద్య యుండుట ఆచరణ శక్తిపై కూడ ప్రభావితమగును, సంకల్ప శక్తిపై కూడ ప్రభావితమగును.

కనుక మొదటగా ఆచరణీయ సవరణను ప్రభావితము చేసేది రెండు ప్రాథమిక విషయములు సంకల్ప శక్తి, ఆచరణ శక్తియేనను విషయమును గుర్తుంచుకోవలెను. ఇందుకు మనము సంకల్ప శక్తిని అధికముగా దృఢపరచుకోవలసిన అవసరమున్నది. ఆచరణ శక్తి లోపమును దూరము చేసుకోవలసిన అవసరమున్నది. ఏదేని ఒక దుష్టత్వమును దూరము చేయవలెనని మనము గట్టిగా సంకల్పించినప్పుడే ఆ దుష్టత్వములు దూరము

కావచ్చును. ఆచరణ బలహీనతను దూరము చేసి, దాని లోపమును దూరము చేసినప్పుడు సంకల్ప దృఢత్వము పనికి వచ్చును. లేనిచో సవరణ అసాధ్యము. ఈ కోణములో మనము మన సంకల్ప శక్తి ఎట్లున్నదని పరిశీలన చేసుకొన్నప్పుడు సంకల్పము విషయానికి వచ్చినచో అందులో చాలా తక్కువ లోపమున్నదని తెలియును. ఎందుకనగా సంకల్ప పరంగా జమాఅత్ లోని సభ్యులందరు లేదా అధికులు వారిలో నిష్టాపరత, పవిత్రత ఏర్పడవలెను, ఇస్లాం ఆదేశములను ప్రచారము చేయవలెను, అల్లాహ్ ప్రేమ, సామీప్యమును పొందవలెనని కోరుదురు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) దీనినిట్లు వివరించిరి. మన సంకల్ప శక్తి గట్టిదని, దృఢమైనదని ఈ విషయములు స్పష్టము చేయును, అయినను సరియైన ఫలితములు వెలువడవు. కనుక రెండింటిలో ఒక విషయము తప్పక గలదు. ఆచరణకు నిజమైన సంకల్ప శక్తి కావలెను, అంతమేరకు మనలో లేదు. అందుకే విశ్వాస సవరణ జరిగినది. కాని కర్మల సవరణకు సంకల్ప శక్తి అవసరముండెను. అది మనలో లేనందున కర్మల సవరణలో మనము విజయము సాధించలేదు. మన ఆరాధనలో కూడ కొంత లోపమున్నదని మనము నమ్మవలెను. అందుకే ఆచరణ శక్తి నిరుపయోగమై సంకల్ప శక్తి ప్రభావమును స్వీకరించడం లేదు. ఉదా॥ ఒక విద్యార్థి యున్నాడు. అతడు తన పాఠమును గుర్తు చేసుకొనును. కాని గుర్తుంచుకోలేక పోవును. అతని మెదడు సరి చేయబడనంత వరకు ఎంత పాఠము చెప్పబడినా, ఎన్ని సార్లు గుర్తు చేయించబడినా లేదా గుర్తు చేయబడుటకు ప్రయత్నించినా అతడు దానిని గుర్తు చేయలేడు. ఇందుకు మనము మన ఆచరణ సవరణ వైపు దృష్టి సారించవలెను. మెదడులోని ఏ భాగములో ప్రభావితమైనచో ఆచరణ సవరణ

మొదలగునో మెదడులోని ఆ భాగములో మన సత్కార్య సంకల్పము ఎందుకు ప్రభావితము కాలేక పోవుచున్నదో పరిశీలించవలెను. ఈ మార్గములో అడ్డంకిగా మారే అవరోధములను మనము దూరము చేయుటకు కృషి చేయవలెను. అప్పుడు మన ఆరాధన ప్రమాణాలు ఏమిటి ? అని చూడవలెను. మన ఆచరణ ప్రయత్నములో సదుద్దేశము, విధేయత, విశ్వసనీయత ఎంత వున్నదని చూడవలెను. ఆచరణ సవరణ మార్గములో రెండు రకముల అవరోధములు ఎదురగును. ప్రస్తావించబడినట్లు ఆచరణ సవరణలో మరో అవరోధము అనగా విద్యాపరంగా బలహీనత కూడ గలదు. ఇది ఇరు వైపుల తన ప్రభావమును చూపును. సంకల్పము కూడ విద్య ప్రకారము నడుచును, ఆచరణ కూడ విద్య ప్రకారము నడుచునట్లు మనము ఆచరణాత్మక జీవితములో చూచెదము. దీని ఉదాహరణ ఇట్లు గలదు. ఒక వెయ్యి మంది సైనికులతో కూడిన సైన్యము అతని ఇంటిపై దాడి చేయుచున్నదని అతనికి తెలియక ఒక్కరిద్దరు వ్యక్తులు దాడి చేయుచున్నారని తెలిసినచో అదే విధముగా అతడు సన్నద్ధమగును. కాని వెయ్యి మంది దాడి చేయుచున్నారని తెలిసినచో అదే విధముగా సన్నద్ధమగును. కనుక విద్య తక్కువ వున్నందున లోపము ఏర్పడును. సరియైన విద్య సంకల్ప శక్తిని పెంచును. ఇదే విధముగా కొన్ని సార్లు మానవుడు ఒక వస్తువును లేపుటకు ప్రయత్నించును. దానిని తేలికైనదిగా భావించును, కాని అది భారీగా యుండును. కావున లేపలేడు. ఒక సారి అంచనా వేసుకున్న తర్వాత అధిక శక్తిని ఉపయోగించును, లేపే పద్ధతిని మార్చుకొనును, అనంతరం దానిని లేపును కూడ. రెండవ సారి అతనిలో అధిక శక్తి రాలేదు. విద్య వున్నందున, సరియైన అవగాహన వున్నందున శక్తిని సరియైన పద్ధతిలో

వినియోగించినందున అతడు సఫలమయ్యెను.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్హు మరో విషయము కూడ ఇట్లు తెలిపిరి. ప్రతి మానవునిలో అల్లాహ్ ఒక పోల్చుకొను శక్తి కలిగించెను. రెండు వస్తువుల మధ్య అతడు తేడాను గుర్తించగలడు. ఫలానా పని చేయుటకు ఇంత శక్తి అవసరము. శక్తి మొత్తము మానవుని చేతిలో యుండదు, మెదడులో సురక్షితముగా యుండును. బరువు లేపే ఉదాహరణ ఇవ్వబడినట్లు మొదటి సారి పని కానప్పుడు అనగా బరువు లేపలేక పోయినప్పుడు మరింత బలము పంపుటకు మానవుడు మెదడుకు సంకేతము పంపును. ఆ బలము రాగానే వస్తువును లేపుట సులభమగును. ఈ పోల్చు శక్తి కూడ విద్య వల్లనే వచ్చును. అంతర్గత విద్య అనగా పరిశీలన, అనుభవము. బాహ్య విద్య అనగా బయటి నుండి చెవులకు చేరే శబ్దములు. బయటి నుండి జరిగే దాడిని ఉదహరించితిని. బయటి దాడుల నుండి మానవున్ని బయటి శబ్దములు జాగరూకము చేయును. కాని ఈ బరువు లేపుటను ఉదహరించబడెను. దీనిని పోల్చుకొను శక్తి స్వయముగా ఇంతకు ముందు తక్కువ బరువున్నదని నీవు ఊహించినందున ఈ బరువు లేపబడలేదని నిర్ణయించుకోవలసి యుండును. ఉదా॥ పది కిలోలు యుండగా ఐదు కిలోలు భావించి తక్కువ బలము వినియోగించితివి. ఇప్పుడు దానిని లేపుటకు పది కిలోల శక్తి వినియోగించినచో లేపగలవు. ఈ నియమమును ముందుంచుకొని ఈ ప్రణాళిక కొరకు నిలబడినచో, అప్పుడు పోల్చుకొను శక్తి ఇందుకు ఎంత వరకు శక్తి అవసరమో నిర్ణయించును. కొన్ని సార్లు సరియైన విద్య లేనందున కర్మల సవరణ చేసుకోలేడు. ఆచరణ సవరణకు ఎంత వరకు శక్తి అవసరమో విద్య లేనందున పోల్చుకొను శక్తి సరియైన

విషయము తెలుపలేదు. కనుక పోల్చుకొను శక్తి మానవున్ని జాగకరూకునిగా చేయును లేదా సరియైన విద్య లేనిచో విస్మరించును కూడ.

"కర్మల సవరణకు మూడు విషయముల దృఢత్వము తప్పనిసరి. ఒకటి దృఢ సంకల్పము. మరొకటి అధిక విద్య. ఆచరణలో శక్తిని పుట్టించుట. ఇది కూడ అనివార్యమే. వాస్తవానికి అధిక విద్య దృఢ సంకల్ప శక్తిలోని భాగమే. ఎందుకనగా అధిక విద్యతోనే దృఢ సంకల్ప శక్తి ఏర్పడును. లేదా ఆచరించుటకు ప్రేరేపించును. ఈ విషయములన్నిటి సారాంశము ఏమగుననగా ఆచరణీయ సవరణ కొరకు మనకు మూడు విషయములు అవసరమగును. మొదటిది గొప్ప గొప్ప కార్యములు చేయగల దృఢ సంకల్ప శక్తి. రెండవది అధిక విద్య. మన సంకల్ప శక్తి ఏది సరియైనదో ఏది కాదో గుర్తించుటకు ఇది ఉపయోగపడును. తద్వారా సరైనదానిని బలపర్చును, దానిని ఆచరించుటకు గట్టి పట్టు పట్టును. అజ్ఞానంలో వుండి మానవుడు అవకాశములను పోగొట్టుకోకూడదు. మూడవది ఆచరణాత్మక శక్తి. మన అవయవములు, మన సంకల్పముల ప్రకారము నడువవలెను. దుస్సంకల్పమును కాక సత్సంకల్పములను ఆచరించవలెను. దాని ఆజ్ఞను ఆచరించుటను నిరాకరించకూడదు.

ఈ విషయములు పాపముల నుండి రక్షించుటకు, కర్మల సవరణకు ప్రాధమికమైనవి. మన సంకల్ప శక్తిని, తన ఆజ్ఞను, శక్తి, బలము, సిద్ధాంతముల ప్రకారము ఒప్పించు ఒక గొప్ప అధికారిగా చేయవలెను. అప్పుడది ఏ సాకును తనపై సఫలము కానివ్వదు. చిన్న, పెద్ద పాపములు అను స్వంత నిర్వచనములు ఊహించుకొని మనపై విజయము సాధించనివ్వకూడదు.

మన సవరణ కొరకు మనము ఈ విషయముల వైపు దృష్టి సారించవలసిన అవసరమున్నది. ఈ విషయములను కలిగించుకోవలసిన అవసరమున్నది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అవతరణ ఉద్ధేశమును పూర్తి చేయువారమగుటకు, అల్లాహ్ మనకు ప్రసాధించిన సామర్థ్యములు తుప్పుపట్టి అంతము కాకుండా వుండుటకు తమ సంకల్ప శక్తిని దృఢపరచుకోవలసిన అవసరమున్నది. ఆచరణ శక్తిని గట్టి పరచుకోవలసిన అవసరమున్నది.

❖

⑥

# ఖుత్బా జుమా సారాంశము : 17 జనవరి 2014

## సంకల్ప శక్తి భావము

హుజూర్ ఇట్లనిరి. ఆచరణ సవరణకు అవసరమున్న మూడు విషయములలో మొదటి విషయము సంకల్ప శక్తి అని మనము చూచితిమి. ఈ సంకల్ప శక్తి ఏమిటి ? సంకల్ప శక్తి గురించి ఇదేమిటని అనబడుట మనలోని కొందరికి ఆశ్చర్యము కలిగించును. ఏదేని కార్యమును చేయుటకు గట్టి సంకల్పము, దానిని పూర్తి చేయు, తుది వరకు చేర్చు అను శక్తిని సంకల్ప శక్తి అనబడునని దాని పదములతోనే స్పష్టమగుచున్నదని అధికులు అందురు. ఈ సంకల్ప శక్తి ఏమిటి ? అను ప్రశ్న ఇచట లేవనెత్తవలసిన అవసరమేముంది. దీని గురించి స్పష్టత రావలెను. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్

రజియల్లాహు తఆలా అన్హు దీనిని ఎంతో గొప్ప రీతిలో వివరించిరి. ఆచరణను బట్టి సంకల్ప శక్తి ప్రతి చోట మారును. కనుక ఈ ప్రాథమిక విషయమును మనము గుర్తుంచుకోవలెను. ఈ విషయమును తమ దృష్టి యందుంచుకొన్నప్పుడే ధార్మిక సమస్యలలో సంకల్ప శక్తి ఏమిటో అను కోణములో ఆలోచించవచ్చును. ధార్మిక సమస్యలలో సంకల్ప శక్తి విశ్వాసమునకు మరో పేరు. ఈ కోణములో ఆలోచించినప్పుడు విశ్వాసము పెరిగినప్పుడు ఆచరణ శక్తి పెరుగునని తెలియును. గట్టి విశ్వాసమున్నచో, అల్లాహ్‌తో సంబంధమున్నచో మానవుని పనులు వాటంతటవే అగుచూ పోవును. ప్రతి కష్టము అల్లాహ్ సహాయము, సహకారముతో సులభమగుచు పోవును. ఆచరణ కష్టములు ఈ విశ్వాసము వలన గాలిలో ఎగిరిపోవును. సులభముగా మానవుడు వాటిని జయించును. ఇవి కేవలము నోటి మాటలే కాదు, ఆచరణాత్మకముగా మనము వాటిని చూచుచున్నాము. మనము ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలమును పరిశీలించినచో విశ్వాసము కంటే ముందటి ఆచరణ స్థితులు, విశ్వాసము తర్వాతి ఆచరణ స్థితుల ఆశ్చర్యకర ఉదాహరణములను చూడగా ఆశ్చర్యము కలుగును.

ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించిన వారు ఎటువంటి వారై యుండిరి. వారి ఆచరణ స్థితి ఎట్లుండెను ? చరిత్ర మనకు దీని గురించి ఏమి తెలుపును. ఆ విశ్వాసులలో దొంగలు కూడ యుండిరి. వారిలో దోపిడీదారులు కూడ యుండిరి. వారిలో పాపిష్టులు, నేరస్తులు కూడ యుండిరి. తల్లులను వివాహమాడే వారు కూడ వారిలో యుండిరి. తల్లులను వారసత్వములో విభజించుకునేవారు కూడ యుండిరి. తమ కుమార్తెలను హతమార్చేవారు కూడ యుండిరి. ప్రతిక్షణం జూదమాడే

జూదరులు కూడ వారిలో యుండిరి. వారిలో మద్యము సేవించేవారు కూడ యుండిరి. మద్యమును ఎంతగా ఇష్టపడేవారనగా ఈ విషయములో ఎవరు వారికి సాటిలేరు. మద్యము సేవించుటనే గౌరవముగా భావించేవారు. నేను ఎక్కువ త్రాగినాను లేదా త్రాగగలనని ఒకరు మరొకరిపై గర్వపడేవారు. రాత్రులలో లేచి లేచి నేను మద్యమును త్రాగుతాను, నీరును నేను ముట్టుకోనే ముట్టుకోనని గర్వముగా కవులు తమ కవిత్వములో తెలిపేవారు. జూదరుడు తమ జూదముపై గర్వ పడుచు నా ధనమును మొత్తం జూదములో పోగొట్టుకుంటాను, మరల ధనము వచ్చినా దానిని జూదములోనే పోగొట్టుకుంటానని తెలిపేవాడు. నేడు అతి పెద్ద జూదరుడు కూడ ఇట్లు నిర్భయముగా ప్రకటించడు కావచ్చు. ఏది ఏమైనప్పటికి అప్పటి పరిస్థితి ఇట్లుండెను. అనంతరం ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించినప్పుడు వారి పరిస్థితి ఎట్లు మారినది. ఎటువంటి విప్లవము వారిలో పుట్టినది. ఈ విశ్వాసము వారిలో ఎటువంటి సంకల్ప శక్తిని పుట్టించినది. దీని సంఘటనలు కూడ చరిత్ర మనకు తెలుపును. ఇంత తొందరగా ఏ విధముగా వారిలో ఇంత గొప్ప విప్లవము ఏర్పడినదని ఆశ్చర్యము కలుగును. విశ్వసించగానే ధార్మిక బోధనను ఆచరించుటకు మనము మన హృదయమును దృఢపరచు కోవలెనని వారు నిర్ణయించుకొంటిరి. దైవాజ్ఞలకు వ్యతిరేకముగా మనము ఏ అడుగు వేయకూడదని వారు నిర్ణయించుకొనిరి. ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతి ఆదేశము మా కొరకు అంతిమ శాసనమని వారు నిర్ణయించుకొనిరి. వారి ఈ నిర్ణయము ఎంత దృఢముగా, గట్టిగా నుండెననగా వారి కర్మల బలహీనతలు ఒక్క క్షణము కొరకు కూడ నిలువలేదు. వారి పరిస్థితులు

ఎలా మారినవనగా ప్రమాదకరమైన బాధలను తమ కొరకు స్వీకరించుటకు సిద్ధమైరి. సిద్ధము మాత్రమే కాలేదు. తమలో కల్పించుకొనిన సంకల్ప శక్తి వారి కర్మల బలహీనతను ఒక భీకర వరద పుల్లను తనతో ఎట్లు కొట్టుకపోవునో అట్లు పారవేసినది, అట్లు దూరము చేసినది.

ఇటువంటి సంకల్ప శక్తి కలిగినచో, ఇంతటి విశ్వాసము కలిగినచో ప్రజల కర్మల సవరణకు మరిన్ని మార్గములను పాటించవలసిన అవసరముండదు. పదు నాలుగు వందల సం॥ క్రితం కర్మల సవరణకు విశ్వాస శక్తి వలన విప్లవము వచ్చెను. దీని ఉదాహరణ ఇంత విశాలముగా ప్రపంచములో మరెక్కడా కనిపించదు. ఎంత ఆశ్చర్యకర రీతిలో ప్రపంచములో విప్లవము సంభవించెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన బానిసను విశ్వసించిన వారిలో దీనిని పోల్చిన అనేక విషయములు మనముందున్నవి. అవి మనకు కనిపించును. పొగత్రాగుట నిషేధము కాదు. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం దీనిని అయిష్టపడిరి. ఇది ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో నుండినచో నిషేధించేవారని కూడ వారొక చోట తెలిపిరి. కాని ఇందులో ఒక దుష్టత్వము తప్పక నున్నది. అదేమనగా ఇది మత్తులోకి నెట్టును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక ప్రయాణము మధ్యలో గుడ్గుడి (హుఖ్ఖా) ని ద్వేషించిరి. గుడ్గుడి అలవాటు యున్న వారు తమ గుడ్గుడిలను పారవేసిరి. అనంతరం వారు మత్తు దరిచేరలేదు.

కనుక మనము ఈ ఉదాహరణలను నెలకొల్పవలసిన అవసరము గలదు. ఏదేని చట్టముతో భయపడి లేదా సమాజముతో భయపడి దుష్కార్యములను వీడ కూడదు. తల్లిదండ్రుల భయము లేదా సమాజపు

భయము వలన వాటితో దూరముండకూడదు. ఈ ఆలోచన వుండకూడదు. అల్లాహ్, అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దీని నుండి నివారించిరని ఈ దుష్కార్యము నుండి దూరముండవలెను. ఈ కాలములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం నివారించిరని దూరముండవలెను. ముస్లిం దేశములలో మద్యము బహిరంగముగా లభించదు. పాకిస్తాన్ మొ॥ విషయము నాకు తెలుసు. ఇప్పుడు చట్టము దీనిని అనుమతించదు. నాటు సారాయి అనబడు మద్యము రహస్యముగా సిద్ధము చేయబడును. అనంతరం త్రాగుదురు, మత్తు కూడ చాలా ఎక్కువ యుండును. ధనిక వర్గము ఇతర మార్గముల ద్వారా మంచి నాణ్యత గల మద్యమును ఏర్పాటు చేసుకొనును. నేను చూచిన ప్రకారము విశ్వవిద్యాలయములో కొందరు విద్యార్థులు మత్తు ఎక్కించు సిరప్, మందులను, ప్రత్యేకముగా దగ్గు సిరప్‌ను మత్తు కొరకు వినియోగింతురు. దాని వలన నష్టము కూడ జరుగును. ఎందుకనగా ఇందులో ఇతర మందులు కూడ కలిసియుండును. ఇటువంటి సమాజములో సురక్షితముగా యుండుట చాలా అవసరము. తమ సంకల్ప శక్తితో ఈ దుష్కార్యముల నుండి దూరముండవలసిన అవసరమున్నది. నేటి రోజులలో ఈ ఐరోపా దేశములలో ఇతర అతి ప్రమాదకర మత్తు పదార్థాలతో పాటు సీసము పేరిట కూడ ఒక మత్తు పదార్థము రెస్టారెంట్లలో ప్రత్యేకముగా ముస్లిం రెస్టారెంట్లలో లభించుచున్నది. ఇటువలనే అమెరికాలో కూడ హుఖ్ఖ పేరుతో మత్తు లభించుచున్నది. అదో ప్రత్యేక రకమైన హుఖ్ఖ. లేదా దానిని ఏమందురో ? ఇక్కడి కొందరు యువతులు, యువకులు ఈ సీసమును వినియోగించుచున్నారు, అందులో మత్తు లేదు లేదా అప్పుడప్పుడు వినియోగించినచో ఏమి కాదు, ఎలాంటి అభ్యంతరము లేదని అంటున్నారని

నాకు తెలిసినది.

అప్పుడప్పుడు వినియోగించే మానవుడు పెద్ద పెద్ద మత్తులలో మునుగును, తర్వాత దానిని విడిచిపెట్టుట చాలా కష్టమగునని గుర్తుంచుకొనుము.

కనుక ఇప్పటి నుండే ఈ సంకల్ప శక్తితో పని తీసుకోవలెను. ఈ దుష్కార్యము నుండి విముక్తి పొందవలెను. ఇందుకు తమ విశ్వాసమును పరిశీలించుకొనుము. విశ్వాస వెచ్చదనమే సంకల్ప శక్తిని కలిగించును. అనుచరుల ఉదాహరణలను మనము చూచినట్లు అది సత్వరమే పెద్ద నిర్ణయములు తీసుకునేటట్లు చేయును.

**విద్యా శక్తి భావము :**

దీనికితోడే విద్యాశక్తి కూడ నున్నది. ఎవరిలోనైనా విద్యాశక్తి యున్నచో విద్యా బలహీనత వలన ఎవరిలోనైనా లోపము ఏర్పడుచున్నచో అది దూరమగును. దీనికి సామాన్య ప్రాపంచిక ఉదాహరణ ఏమనగా బాల్యపు కొన్ని విషయములు పిల్లలలో యుండును. మట్టి తినే అలవాటు ఒకనికి యుండును. దాని నష్టము గురించి తెలిసినప్పుడు దానిని దూరము చేసుకొనుటకు అతడు కృషి చేయును, తనను తాను దూరముంచుకొనును. ఉదా॥ నాకు తెలిసిన ఒక అమ్మాయి రాత్రి నిం్రదించే ముందు తన కేశములను గుంజుకుంటూ తనను తాను గాయపరచుకునేది. కాని ఇప్పుడు వయసు పెరుగుచున్నది. కొద్ది కొద్దిగా ఆమెకు తెలియుచున్నది, ప్రయత్నించి ఈ అలవాటును దూరము చేసుకుంటున్నది. ఏది ఏమైనప్పటికి తెలిసినందున ఈ అలవాటు అంతమగును.

ఇటులనే అల్లాహ్ భయమున్న వ్యక్తికి కర్మల పాపము, అల్లాహ్

అసంతృప్తి గూర్చి సరియైన అవగాహన కల్పించినచో, పాపముతో అల్లాహ్ ఏ విధముగా కోపగించుకొనునో గట్టిగా తెలుపబడినచో అతడు పాపము నుండి దూరముండును.

## ఆచరణ శక్తి భావము

ఆచరణ బలహీనత ఏర్పడుటకు మూడవ కారణము ఆచరణ శక్తి లోపము. ఈ మూడు రకాల ప్రజలు ప్రపంచములో యున్నారు. ప్రపంచములో ఈ వ్యాధులు కూడ గలవు. ఆచరణలో బలహీనత కొందరిలో విశ్వాసము సంపూర్ణము కానందున యున్నది. కొందరి విద్య సంపూర్ణము కానందున వారిలో ఆచరణ బలహీనత గలదు. మరి కొందరికి విశ్వాసము, విద్య యుండును కాని ఇతర కారణాలతో వారిపై తుప్పు పట్టడంతో రెండు చికిత్సలు సరిపోవు. బయటి నుండి చికిత్స చేయవలసిన అవసరముండును. ఒక ఆసరా అవసరముండును. ఉదా॥ ఒకరి ఎముక విరిగిపోయినచో బయటి నుండి పట్టి వేసి ఆసరా ఇవ్వబడును. ఎముక గట్టి పడడానికి కొన్ని సార్లు శస్త్ర చికిత్స చేసి ప్లేట్లు వేయబడును. అనంతరం చిన్న చిన్నగా ఎముక అతుక్కొన్న తర్వాత ఆ ఆసరాలను తొలగించబడును. ఇదే విధముగా కొందరి మానవులకు కొంత కాలము వరకు ఆసరా అవసరముండును. క్రమేణ ఆ ఆసరా అతనిలో ఎంత శక్తిని పుట్టించుననగా అతడు స్వయముగా క్రియాశీలకముగా మారును, ఆచరణీయ బలహీనతలు దూరమగును. నేను గత ఖుత్బాలో చెప్పినట్లు మన జమాఅత్ వ్యవస్థ, మన పదవీదారులు, మన ఉపశాఖలు ఈ ఆచరణీయ బలహీనతలను దూరము చేయుటకు కారణము కావలెను. కాని స్వయముగా ఈ పదవీదారులలో సంకల్ప శక్తి తక్కువగా యున్నచో, విద్య తక్కువగా యున్నచో, ఆచరణ తక్కువగా

యున్నచో మరొకరికి ఆసరా ఎట్లగుదురు. కనుక జమాఅత్ ప్రగతి కొరకు వ్యవస్థలోని ప్రతి భాగమే కాక ప్రతి అహ్మదీ తమ ఆత్మ పరిశీలన చేసుకొనుచు తమ సవరణకు ప్రయత్నించవలెను. తద్వారా జమాఅత్ ప్రతి సభ్యుడు ఆచరణీయ సవరణలో ఉత్తమ ప్రమాణములను అందుకొను వాడగును. ఈ విధముగా అతడు అల్లాహ్ సామీప్యము పొందువాడగును. అల్లాహ్ ఇందుకు మనలను అనుగ్రహించుగాక! (ఆమీన్)

❖

⑦

# ఖుత్బా జుమా సారాంశము : 24 జనవరి 2014

## సంస్థ శిక్షకులు, ఉపదేశకుల బాధ్యతలు

హుజూర్ ఇట్లనిరి. మన మురబ్బీలు, మన విద్యావంతులు, ఉపదేశించే అవకాశము లభించు లేదా తమ విధులలో భాగమైన మన పదవీదారులు, ఉపశాఖల పదవీదారులు కూడ ఇందులో యున్నారు, ప్రత్యేకముగా ఈ విషయములను గుర్తుంచుకొనుము. తద్వారా జమాఅత్ సభ్యుల ఆచరణీయ సవరణలో తమ తమ పాత్ర పూర్తిగా పోషించగలరు. దీని గురించి నేను చాలా విషయములను సందర్భానుసారము జమాఅత్‌నకు తెలుపుచు యుండెదను. ఇప్పుడు ఎమ్.టి.ఏ వరము వలన జమాఅత్ సభ్యులు ఎమ్.టి.ఏ. ద్వారా సంబంధము కలిగియున్నచో నా మాటలను నేరుగా వినెదరు. అల్లాహ్ కృపానుసారము వారు ప్రభావితమైతారు కూడ.

లేదా అధికులు ప్రభావితమగుదురు. కాని ఈ పద్ధతిలో తమ కార్యక్రమములను నిర్వహించుట, ఈ ఉద్దేశముతో సిద్ధము చేసిన కార్యక్రమములను పదే పదే జమాఅత్ ముందు ప్రవేశపెట్టుట మురబ్బీలు, అధ్యక్షులు, పదవీదారుల కర్తవ్యము. తద్వారా ప్రతి అహ్మదీయుని మెదడులో అతని కర్మల పరిధి మంచిగా స్పష్టమై, గుర్తుండును.

బాధ్యతలు కలిగిన వారందరు దీనిని గుర్తుంచుకొనుట చాలా ముఖ్యము. సంకల్ప శక్తి దృఢత్వమే సవరణ కారణములలో అన్నిటికంటే మొదటి భాగమని ప్రస్తావించనైనది. మరో రకంగా చెప్పాలంటే అది విశ్వాసమనబడును. దానినే పుట్టించుటకు సందేశహరులు ప్రపంచములో అవతరింతురు. ఆ సందేశహరులు తాజా, సజీవ మహిమలు చూపెదరు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్హు ఇట్లనిరి. మన జమాఅత్‌నకు అల్లాహ్ తాజా, తాజా సంకేతములు ఎంత అధికముగా యున్నవనగా వాటికి సమీపములో కూడ మరొకరి వద్ద లేవు. అల్లాహ్ తాజా వాక్యము, అతని సజీవ మహిమలు, అతని ఉనికిని దర్శించే సంకేతములు ఇస్లాం కంటే బయట మరే ధర్మము వద్ద లేవు. అవి మానవ హృదయములు అన్ని రకాల మలినముల నుండి శుభ్రము చేయుచు, అల్లాహ్ విజ్ఞానముతో పూరించును. కాని "ఈ విశ్వాసమున్నను ఈ తాజా సజీవ మహిమలున్నను మన జమాఅత్ కర్మలలో బలహీనత ఎందుకున్నది? దీని గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) తమ అభిప్రాయమును ఇట్లు తెలిపిరి. జమాఅత్ విద్యావంతులు, శిక్షకులు, ఉపదేశకులు దానిని వ్యాపింపజేయుటలో ప్రత్యేక శ్రద్ధ వహించలేదు. నేటికి 75, 76 సం॥ క్రితం నాటి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) మాట సరియైనట్లే నేడు కూడ

సరియైనదే. దీనిపై ఆలోచించవలసిన అవసరముంది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కాలము నుండి దూరమగుచున్న కొద్ది మనము ఇటువైపు పూర్తి planning (ప్రణాళిక) తో శ్రద్ధ వహించవలసిన అవసరమున్నది. వారు చెప్పినది నేడు కూడ గమనించ దగినదే. మసీహ్ మరణము గురించి ఎంత గట్టిగా ఉపన్యాసములు చేయుదురో, లేదా విమర్శకులకు జవాబుగా విమర్శల సూచనలు అనగా వారి పూర్వీకుల సూచనలు తీసి విమర్శకుల ముందు ప్రవేశపెట్టి, వారి నోరు మూయింతురు, అంతటి ప్రయత్నము జమాఅత్ సభ్యుల ముందు జమాఅత్ సరియైన బోధన ప్రవేశపెట్టుటకు చేయరు, కనీసం విద్యావంతుల వైపు నుండి జరగడం లేదు. ఫలితముగా మసీహ్ మరణము గూర్చి నిదర్శనములు తెలిసినవారు లేదా మౌల్వీల విమర్శలకు నోరు మూయించె సమాధానములు ఇచ్చేవారు లభింతురు. ఇక్కడ కూడ మీరు గమనించగలరు. కొన్ని చానల్లు లేదా ఇంటర్నెట్‌పై మౌల్వీ చేసిన విమర్శకు చాలా మంచి మంచి సమాధానములు గొప్ప రీతిలో ఒక సాధారణ అహ్మది ఇచ్చును. టి.వి. ద్వారా జరిగిన తమ సంభాషణల నివేదిక నాకు కూడ కొందరు పంపింతురు. తమ సమాధానములను కూడ వ్రాయుదురు. అధికముగా వారి సమాధానములు మంచిగా, విద్యతో కూడినవై యుండును.

ఈ విధముగా మనము ఆయుధములు ధరించియున్నాము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అల్లాహ్‌ను ఏ విధముగా మన ముందు ప్రవేశపెట్టిరో తెలిసినవారిని చాలా తక్కువ పొందెదరు. దైవ ప్రేమ, విజ్ఞానమును పొందుటకు ఏ పద్ధతిని వారు తెలిపిరి ? అతని సామీప్యమును పొందుటకు ఏ పదములలో ఉపదేశించిరి. అల్లాహ్ తాజా వాక్యము, అతని

మహిమలు, సంకేతములు వారిపై ఎంత గొప్పగా ప్రత్యక్షమైనవి. అందుకు కొన్ని కొన్ని సార్లు ఇట్లగును. ఒక వ్యక్తి మసీహ్ మరణమును అంగీకరించును, అందుకు నిదర్శనము కూడ ఎరుగును, తల్లిదండ్రుల వారసత్వములో అతనికి అహ్మదియ్యత్ లభించినది. ఈ విషయములన్నియు తెలిసినను, అంతా ఎరిగినను మరో వైపు కొన్ని విషయములు తెలియనందున విశ్వాస బలహీనత ఏర్పడును. విశ్వాసము కూడ ఊగిసలాటలో పడును. ఆచరణీయ బలహీనతలు కూడ ఏర్పడును.

నిస్సందేహముగా ఒక వ్యక్తి మసీహ్ మరణ సమస్యను గట్టిగా నమ్మును. కాని ఈ సమస్య తెలిసినందున అతని ఆచరణ స్థితి సంస్కరించబడదు. అందుకు ఈ కోణములో జమాఅత్‌లో కొన్ని చోట్ల బలహీనత దర్శనమిచ్చును. కనుక జమాఅత్ ముందు ఆదర్శముగా నుండవలసిన, సవరణ బాధ్యులైన మన జమాఅత్ విద్యావంతులు, శిక్షకులు, మొత్తం అధ్యక్షులు, పదవీదారులు తగిన రీతిలో ఇటు వైపు శ్రద్ధ వహించనంత వరకు, జమాఅత్‌లోని ప్రతి వ్యక్తిని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అవతరణ ఉద్దేశముతో జోడించుటకు కృషి చేయవలసినంత వరకు చేయనిచో మన జమాఅత్‌లో కర్మల సవరణ బలహీనత గల వారు జమాఅత్‌లో అధికముగానే నుందురు. అల్లాహ్‌ను ఆరాధించవలెననే ఉత్సాహము మనలో ఎంత మందికి యున్నదో, రమజాన్‌లో ఒక నెల ఉపవాసముండి లేదా అల్లాహ్ సామీప్యము శాశ్వతముగా పొందుటకు ఒకసారి ఈతికాఫ్ కూర్చొని సంవత్సరమంతా లేదా అనేక సంవత్సరముల వరకు దానిని వ్యక్తపరచుటతో కాక స్థిరత్వముతో, ఉత్సాహము, ప్రయత్నముతో తనపై విధించుకొను వారు ఎందరున్నారో

చూడవలసిన, పరిశీలించవలసిన, తెలుసుకోవలసిన అవసరముంది. ప్రేమపూర్వకముగా అల్లాహ్ వ్యవహరించి, దుఆలను ఆమోదించి, సంకేతము చూపువారు మనలో ఎందరున్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను విశ్వసించి ఈ ప్రమాణమును పొందుట లేదా పొందుటకు కృషి చేయుట ప్రతి అహ్మదీయుని కర్తవ్యము.

మన విద్యావంతులు, మన శిక్షకులు, మన పదవీదారులు తమ తమ పరిధిలో సభ్యుల ముందు దైవ ప్రేమను పొందుటకు ప్రయత్నించుటను పదే పదే ప్రస్తావించరు. లేదా ప్రస్తావించవలసిన రీతిలో ప్రస్తావించరు. లేదా వారి ఉదాహరణలు ప్రజలను ఆకర్షించే విధముగా నుండవు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం, వారి అనుచరులను పదే పదే ప్రస్తావించి, దీని గురించి అల్లాహ్ సహాయము, సంకేతముల సంఘటనలను అనగా వారితో సంభవించిన వాటిని తరచుగా ప్రస్తావించరు. అల్లాహ్ తన లక్షణములను కొందరు వ్యక్తులకు, ప్రత్యేక సమయము కొరకు పరిమితం చేయలేదని నమ్మకము కలిగించరు. ఈ విషయములను పదే పదే ప్రస్తావించినచో ఈ సంబంధమే ఏర్పరచుకొను పద్ధతులను తెలిపినచో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంతో అల్లాహ్ చేసిన వాగ్దానములను ప్రస్తావించినచో దుఆ తత్వజ్ఞానము అర్థమగును. చిహ్నములు కూడ వ్యక్తమగును.

ఈ కాలములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన బానిసతోనే సంబంధమేర్పరచుకొని అల్లాహ్ సామీప్యపు సంబంధమును ఏర్పరచుకోవచ్చునని తరచుగా చెప్పవలసిన అవసరముంది. సంకేతములు కేవలం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కాలము వరకే

పరిమితము లేదా ప్రత్యేకించబడలేదు. ఇప్పుడు కూడ అల్లాహ్ తన సకల శక్తులతో వైభవమును ప్రదర్శించును. కనుక సత్కార్యములను పొందు ఉత్సుకత, అల్లాహ్ సామీప్యమును పొందు వ్యాకులత మన జమాఅత్‌లో సాధారణమైనచో పాపమును చాలా వరకు అంతము చేయగల ఒక పెద్ద భాగము ఏర్పడును. పాపమును పూర్తిగా అంతము చేయుట కష్టమే. దీనిని దావాగా ప్రకటించలేము, కాని చాలా వరకు దానిని జయించవచ్చును. జమాఅత్‌లోని అధిక భాగము లేదా అధికులు పాపములను జయించవచ్చును.

ఇందుకు మన మురబ్బీలు, అధ్యక్షులు, పదవీదారులు తమ తమ పరిధిలో సవరణకు ప్రయత్నము చేయవలెను. తనను పూర్తిగా అనుసరించిన వారికి అల్లాహ్ సామీప్యము లభించును, అటువంటి వారి దుఆలను అధికముగా అల్లాహ్ ఆమోదించునని హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాంనకు అల్లాహ్ తెలిపినాడని చెప్పి ఈ సంస్కరణ చేపట్టవలెను. అల్లాహ్ కృపానుసారము జమాఅత్‌లో ఇటువంటి వారున్నారు, నాకు కూడ వ్రాయుదురు. కొన్ని సంఘటనలు వివిధ సందర్భములలో ప్రస్తావించబడును కూడ. నేను కూడ ప్రస్తావించుచుందును. అనుసరించు ఉత్సాహము కలుగుటకు ఇటువంటి సంఘటనలు ప్రస్తావించబడును. అల్లాహ్ సన్నిహిత సంబంధము కలుగుటకు వాటిని విని అనుసరించవలెను.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక చోట ఇట్లనిరి. ప్రపంచములో నున్న జాతులన్నిటిలో సమాధానమిచ్చు, దుఆలను విను దేవున్ని ఏ జాతి విశ్వసించలేదు. నేను యేసుక్రీస్తును దేవునిగా విశ్వసించినాను, అతడు నా దుఆను వినును, సమాధానమిచ్చునని ఒక క్రైస్తవుడు అన్నచో అది వాస్తవము కానే కాదు. సమాధానమివ్వగల దేవుడు

ఒక్కడు మాత్రమే యున్నాడు. అతడే పవిత్ర ఖుర్ఆన్ ప్రవేశపెట్టిన ఇస్లాం దేవుడు. اُدْعُوْنِيْٓ اَسْتَجِبْ لَكُمْ (అల్‌ముమిన్ : 61) నన్ను యాచించుము నేను సమాధానమిత్తునని అతడనెను.

ఈ విషయములు పదే పదే జమాఅత్ ముందు ప్రస్తావించవలెను. నిశ్చయముగా అందులో శక్తి కలుగును. లేదా జమాఅత్‌లోని అధిక భాగములో ఈ శక్తి పుట్టును. వేలాది పాపములను జయించు, వాటితో శాశ్వతముగా సురక్షితమగు సంకల్ప శక్తి వారికి లభించును. ఎన్నడు ఊగిసలాడని సంబంధము అల్లాహ్‌తో ఏర్పడును. పాపముల నుండి మానవజాతిని రక్షించు, అల్లాహ్ ప్రీతి అన్నిటికంటే ప్రధానమయ్యే విధముగా అల్లాహ్ సంబంధము ఏర్పడుటయే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అవతరణ ఉద్దేశము. ప్రార్థన నుండి తప్పించుకొనుటకు సాకులు అన్వేషించే బదులు లేదా విధిగా భావించి ఆదర బాదరగా చేసే బదులు, ఒక భారముగా భావించి తల నుండి దించే బదులు ఒక ఉత్సాహము కలుగవలెను.

ప్రతి ఒక్కరు తమ తమ పరిధిలో ఈ పనిని మొదలు పెట్టినచో ఒక స్పష్టమైన మార్పు కనిపించవచ్చును. ఈ కాలములో విద్య పేరున అనేక దుష్కార్యములను పాఠశాలలో పిల్లలకు బోధించుచున్నారు. ఎంతో అధికముగా మన జమాఅత్ పిల్లలకు, యువకులకు వాస్తవమును తెలియజేయవలసిన అవసరముంది. విద్యావగాహన మాటున పిల్లలకు పాఠశాలలో బాల్యములోనే బోధించుచున్న విద్యా నష్టములతో తల్లిదండ్రులు తమ స్థితులను పరిశీలించుకొని తమను తాము అవగాహన పరచుకోవలసిన అవసరమున్నది. తమను తాము రక్షించుకొని తమ పిల్లలను రక్షించుకునే

పద్ధతి తల్లిదండ్రులకు కూడ తెలియవలెను. ఇక్కడ చాలా చిన్న వయసులో అనవసర విషయములు బోధించబడును. మంచి చెడు తేడా తెలుసుకొనుటకు అని వాదింతురు. వాస్తవానికి మంచి చెడు తేడా తెలియక బాల్యములో తప్పుడు ఆలోచన కలుగు వారగుదురు. ఎందుకనగా వారి ముందు వారి తల్లిదండ్రుల లేదా సమాజములోని చెడు ఉదాహరణలే అధికముగా యుండును.

కనుక తప్పుడు విద్య బదులు సరియైన వ్యిదను మురబ్బీలు, పదవీదారులు, ఉపశాఖల పదవీదారులు, తల్లిదండ్రులు అందరు ఏకమై ఉమ్మడి ప్రయత్నముతో ఏర్పాటు చేయవలెను. పాఠశాలల పద్ధతిని మనము నివారించలేము. అక్కడ మనము జోక్యము చేసుకోలేము. కాని మలినము, నిర్లజ్జత తేడాను తెలిపి, పిల్లలను విశ్వాసములోకి తీసుకొని తమ ఆచరణాత్మక ఉదాహరణలు చూపి సమాజపు ప్రభావము నుండి రక్షించగలము. ఉత్తమ రీతిలో మన బాధ్యతలను నిర్వర్తించు అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించు గాక! (ఆమీన్)

❖

⑧

# ఖుత్బా జుమా సారాంశము : 31 జనవరి 2014

## ఆచరణ సవరణకు నాలుగు సహాయముల అవసరము

## (1) విశ్వాసము (2) ఆచరన (3) పర్యవేక్షణ (4) బలవంతము

హుజూర్ ఇట్లనిరి. గత ఖుత్బాలో సంకల్ప శక్తిని కలిగించు, విద్యా లోపమును దూరము చేయుటను ప్రస్తావించనైనది. కాని ఇందులోని మూడవ విషయము ప్రస్తావించలేదు. అనగా ఆచరణాత్మక బలహీనతలను దూరము చేయు పద్ధతి ఏమిటి లేదా ఆచరణాత్మక శక్తిని ఏ విధముగా పెంచవచ్చును. దీని గురించి నేడు నేను కొంత మేరకు ప్రస్తావింతును. గత ఖుత్బాలలో ప్రస్తావించినట్లు ఇందుకు బయటి చికిత్స లేదా సహాయము అవసరముండును. లేదా ఇతరుని సహాయము అవసరమని అనవచ్చును. ఆచరణాత్మక సవరణకు రెండు సహాయములు అవసరము. ఒకటి పర్యవేక్షణ, రెండవది బలవంతము. పర్యవేక్షణ అనగా వరుసగా గమనించవలెను, ఎవరైనా దుష్కార్యము చేయకుండా పర్యవేక్షణ జరుగుచుండవలెను. ఇటువంటి పర్యవేక్షణ ప్రాపంచిక విషయములలో కూడ యుండును. గృహములలో తల్లిదండ్రులు పిల్లలను పర్యవేక్షింతురు. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించడముతో పాటు పర్యవేక్షణ పాత్ర కూడ పోషింతురు. కొన్ని సార్లు ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ చేయుదురు. మేము పర్యవేక్షణ చేయుదుమని చెప్పెదరు. రోడ్లలో స్థిరముగా కెమరాలు పెట్టబడి యుండును.

కెమరా యున్నదని సూచిక బోర్డులు యుండును. పర్యవేక్షణకు ఇదొక కార్యము.

పర్యవేక్షణ ఆచరణాత్మక సవరణకు తప్పనిసరి. సమాజము మానవున్ని పర్యవేక్షించుచున్నదని అతడు అనేక దుష్కార్యముల నుండి దూరముండును. తల్లిదండ్రులు తమ పరిధిలో పర్యవేక్షించుచుందురు. శిక్షకులు కూడ తమ పరిధిలో పర్యవేక్షించుచుందురు. ఇతర వ్యవస్థ కూడ తమ తమ పరిధిలో పర్యవేక్షించవలసిన అవసరము గలదు. ప్రతి పర్యవేక్షకుడు తన తన పర్యవేక్షణ గురించి ప్రశ్నించబడునని ఇస్లాం బోధించును. పర్యవేక్షణలో నున్న వారి సవరణతో పాటు పర్యవేక్షకుల సవరణ కూడ జరుగుచుండును. సంక్షిప్తముగా ఆచరణాత్మక సవరణకు పర్యవేక్షణ కూడ అనివార్య కారణము.

సవరణకు అవసరమైన రెండవ విషయము బలవంతము. బలవంతము ధర్మమును విశ్వసించుటకు కాదు. మనము ఒక వైపు "ధర్మములో నిర్బంధము లేదని" అనుచు రెండవ వైపు ఆచరణ సవరణకు చికిత్సగా నిర్ణయించుచున్నది బలవంతమనే ప్రశ్న ఇచట ఒకరి హృదయము లో తలెత్తవచ్చును. ఈ బలవంతము ధర్మమును స్వీకరించుటకు లేదా నిరకారించుటకు కాదని స్పష్టము కావలెను. ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ గలదు. ఏ ధర్మమును ఇష్టపడునో పాటించవచ్చును ఏ ధర్మమును కోరునో నిరాకరించవచ్చును. ఇస్లాం ఈ స్వేచ్ఛను చాలా స్పష్టముగా కలిగించును. ఇక్కడ బలవంతము అనగా ధర్మమును విశ్వసించిన తర్వాత దాని నియమములను ఆచరించక, అవిధేయత వహించడం. ఒక వైపు తనను జమాఅత్ వ్యవస్థలో భాగముగా ప్రకటించడం. మరల వ్యవస్థ

నియమములను భంగపరచుట. ఇటుల జరిగినచో కఠినముగా వ్యవహరించబడును. బలవంతమనగా ఇదే విషయము. వ్యవస్థలో భాగమై వుండదలచినచో దాని బోధనను కూడ ఆచరించవలెను. లేనిచో శిక్ష విధించబడును. జరిమానా కూడ వేయబడును. కొన్ని అంక్షలు కూడ విధించబడును. ఈ విషయములన్నిటి ఉద్ధేశము సవరణయే. ఇటుల ఆచరణ శక్తి బలహీనతను దూరము చేయబడును. జమాఅత్‌లో కూడ జమాఅత్ వ్యవస్థ శిక్షించు ముఖ్య ఉద్ధేశము సవరణయే. ఒకరిని అవమానించుట, అనవసరముగా బాధలో పడవేయుటకు కాదు. ఈ బలవంతము ప్రభుత్వ చట్టములలో కూడ యున్నది. శిక్షలు కూడ విధించబడును. కారాగారములలో కూడ బంధించబడును. కొన్ని సార్లు శిక్షించబడును కూడ. సమాజములో శాంతి స్థిరముగా నుండి, ఇతరులకు నష్టము కలిగించే వారు, నష్టము కలిగించకుండా వుండవలెనని దీని ఉద్ధేశము. తమకు తాము నష్టము కలిగించుకునే పనులపై కూడ కొన్ని సార్లు శిక్షించబడును. కాని ఈ శిక్ష మధ్యలో సవరణకు అనేక మార్గములు అవలంభించబడును. ఒకరికి ఉరిశిక్ష విధించబడినను హంతకుడు ఒకని ప్రాణము తీసుకున్నాడని విధించబడును. హంతకులను స్వేచ్ఛగా వదిలిపెట్టినచో సమాజములోని శాంతి నాశనమగును. అనేక హంతకులు సిద్ధమగుదురు. హత్యకు ఉరి శిక్ష విధించబడడముతో హతమార్చే స్వభావము కలిగినవారు లేదా అధిక ఉత్తేజము గల వారు సంస్కరించబడి నిలువరించబడుదురు. ఏది ఏమైనప్పటికి ఈ బలవంతము కూడ సవరణకు ఒక మార్గము. ప్రాపంచికుని బలవంతము లేదా ప్రాపంచిక శిక్షలతో విశ్వాసముతో ఎలాంటి సంబంధము లేదు. ఒక ధర్మము వైపు సూచించబడు వ్యక్తిపై బలవంతము చేయబడి

నప్పుడు లేదా ధార్మిక వ్యవస్థ ప్రకారము అతన్ని శిక్షించబడినప్పుడు లేదా ఏదేని జరిమానా, శిక్ష, పలు ఆంక్షలు విధించబడును. జమాఅత్‌లో కొన్ని సార్లు చందాలు తీసుకోవడంలో ఆంక్షలు విధించబడును. నిస్సందేహముగా బలవంతముగా ఈ పనుల నుండి నిలువరించబడును. కాని వెంట, వెంటనే సత్కార్యముల వైపు దృష్టి సారించబడును. ఒక వ్యక్తి శిక్ష నుండి తప్పించుకొనుటకు, వర్తమాన ఖలీఫా అసంతృప్తి నుండి తప్పించుకొనుటకు లేదా అల్లాహ్ అసంతృప్తి నుండి తప్పించుకొనుటకు చేసినప్పుడు నెమ్మదిగా విశ్వాసము కూడ హృదయములో కలుగును. అనంతరం అది పెరగడం మొదలగును. ఇటువంటి దుష్కార్యములను వీడి సంతోషముగా సత్కార్యములు చేయువారుగా సిద్ధమవడం మొదలగుదురు. కనుక సత్కార్యములను అవలంభించు అలవాటు చేయుటకు వివిధ మార్గములను వినియోగించవలసిన అవసరముండునని సదా గుర్తుంచుకొనుము. ఈ మార్గములను అవలంభించనిదే కర్మల సవరణ సాధ్యము కాదు. కనుక ఈ మార్గములను అవలంభించుట ఎంతో అనివార్యము.

ఈ నాలుగు విషయములు లేనిదే సవరణ కష్టము. మనము లోతుగా ఆలోచించినచో విశ్వాస శక్తి తమలో లేని అనగా కర్మల సవరణకు మానవునిలో కావలసినంత ప్రమాణము లేని ఒక పక్షము ప్రపంచములో యున్నది. ప్రజల హృదయములలో విశ్వాస శక్తి నింపినచో వారి కర్మలు సరి అగును. మరో పక్షము అజ్ఞానము వలన పాపములకు పాల్పడును. సత్కార్యములు చేయుటకు ఇతరుల సహాయము అవసరమున్న పక్షము మరొకటి గలదు. వీరు మూడు రకాలు. వీరి అవసరము రెండు రకాలు. లేదా రెండు రకాలుగా వీరికి సహకరించవచ్చును. ఒకటి పర్యవేక్షించి. పర్యవేక్షించినచో

దుష్కార్యములు దూరమై, సత్కార్యముల వైపు దృష్టి కలుగునని నేనింతకు ముందే వివరించినాను. మరో పక్షము చాలా దిగజారి పోయినది. అది పర్యవేక్షణతో సరికాదు, శిక్షించనంత వరకు వారి సవరణ అసాధ్యము.

ఈ నాలుగు మార్గములను జమాఅత్ సవరణకు కూడ అవలంభించవలసిన అవసరమున్నది. ప్రతి ఒక్కరి వ్యాధికి వ్యాధిని బట్టి చికిత్స చేయుట తప్పనిసరి. మతము వద్ద ప్రభుత్వము లేనప్పుడు, ఖడ్గము లేని కాలములో ఈ నాలుగు చికిత్సలు అనివార్యమగును.

మొదట చికిత్సగా శిక్షణనిచ్చి విశ్వాసములో దృఢత్వము కలిగించుట తప్పనిసరి అగును. ఇందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం సంకేతములు, వారి సువార్తవాణి, అల్లాహ్‌తో వారి సంబంధము, వారిని విశ్వసించిన వారిలో వారి ద్వారా ఏర్పడిన విప్లవమును ప్రస్తావించవలెను. ఈ ప్రస్తావన వరుసగా పదే పదే జరగవలెను. అల్లాహ్ ప్రేమ మానవునికి ఎట్లు కలుగునో చెప్పవలసిన అవసరముంది. అతని ప్రేమ ఒక మానవునికి లభించినప్పుడు అల్లాహ్ అతనితో ఏ విధముగా ప్రత్యేకంగా వ్యవహరించును. ఈ విషయము గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఏ విధముగా తెలిపిరి. ఆఫ్రికా నుండి, అరబ్బుల నుండి వివిధ జాతుల నుండి క్రొత్తగా అహ్మదీయులు అయినవారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పుస్తకములను చదివి వారిలో ఎలాంటి మార్పు కలిగినది, వారి విశ్వాసము ఎంత పెరిగినదో తమ సంఘటనలను వ్రాయుదురు. నిస్సందేహముగా పుస్తకములు చదివి వారి విశ్వాస అపోహలు దూరమైనవి. విశ్వాసపరంగా వారి విద్య కూడ పెరిగి విశ్వాసపు నూతన మార్గములు వారికి కనిపించినవి. హజ్రత్ మసీహ్

మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం సంకేతములను చూచి, వారి సువార్త వాణిని అర్థము చేసుకొని, అల్లాహ్‌తో వారి సంబంధమును చూసి వారి విశ్వాస దృఢత్వము పెరిగినది. అనంతరం అల్లాహ్ కూడ పలు సంకేతములను చూపి తన సామీప్య దృశ్యమును చూపెను.

మన హృదయములలో కూడ విశ్వాస కిరణాలను ప్రకాశవంతము చేయు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం సంకేతములు, సువార్తవాణి, దైవవాణీలు, అల్లాహ్‌తో సంబంధపు ప్రాముఖ్యతను వివరించుచు తన ప్రత్యేక విధానములో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లనిరి. హజ్రత్ ఈసా (అ) నిస్సందేహముగా ఆకాశములో కూర్చోవచ్చును. మన హృదయములలో అల్లాహ్ మరణించినచో ఎంత నష్టము కలుగునో ఆకాశమున వారు కూర్చోవడంతో అంత నష్టము కలుగదు. మీరు అల్లాహ్‌ను ప్రజల హృదయములలో చంపి జీవింపజేయుటకు కృషి చేయనప్పుడు హజ్రత్ ఈసా అలైహిస్సలాం మరణముపై పట్టుబట్టడంతో లాభమేమిటి. అల్లాహ్ స్వయంభువు, సర్వమునకు కారకుడు. ఎన్నడు మరణించడు. కాని కొందరి మానవుల దృష్టిలో అతడు మరణించును. దేవుడు మరణించడు, కాని ఒక మానవుడు అతన్ని మరచిపోయినప్పుడు అతని దృష్టిలో అతను మృతి చెందును.

విచిత్రమేమనగా మన విద్యావంతులు హజ్రత్ ఈసా (అ) ను చంపుటకు ప్రయత్నింతురు. కాని దానికి తోడు అల్లాహ్‌ను బ్రతికించుటకు ప్రయత్నించరు. అల్లాహ్ అవగాహన, పరిచయము తెలిసే ఆత్మను కలిగించరు. అల్లాహ్‌ను సజీవము చేయుటకు, అతనితో సజీవ సంబంధము ఏర్పాటు చేయుటకు మన నిజమైన ప్రయత్నము జరుగవలెను. అల్లాహ్‌తో

మనకు సజీవ సంబంధమున్నచో ఈసాను సజీవముగా భావించేవారు ఎంత మొత్తుకున్నా మన విశ్వాసములో ఎలాంటి లోపము కలిగించలేరు. ఎందుకనగా అడుగడుగునా అల్లాహ్ మనలను రక్షించును. నిస్సందేహముగా మసీహ్ మరణము, ప్రవక్తుత్వ ముద్రణ లేదా ఇతర సమస్యల సంబంధము విశ్వాసముతో గలదు. వాటిని తెలుసుకొనుట చాలా ముఖ్యము. వాటిపై నిరాధారముగా కాక నిదర్శనములతో స్థిరముగా నుండుట కూడ తప్పనిసరి. కాని ఆచరణ సవరణకు మనము అల్లాహ్‌తో సంబంధము కలిగియుండి, ఈ కాలములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మనకు చూపిన మార్గములను అవలంభించవలెను. మన ప్రకటన, ఆచరణలో వైరుధ్యమును మనము అంతము చేయవలెను. మనము ఇతరులతో అంటున్న విషయములను మనమెంత వరకు పాటించుచున్నామో పరిశీలించుకోవలెను.

భారత దేశములో వ్యతిరేకులకు సమాధానమిచ్చుటకు గతములో బహిరంగసభలు జరిగేవి. అవి ఇప్పుడు జరగడం లేదు. ఆ బహిరంగ సభలలో వ్యతిరేక విద్యావంతులపై మేము గట్టి దాడులు చేసే వారము. ఒక దాని వెనుక మరొక దాడి వారిని కోలుకోకుండా చేసేదని ఖాదియాన్ నుండి ఒక విద్యావేత్త నాకు వ్రాసెను. అలా చేసేవారు, సరే మంచిదే. వ్యతిరేకులకు సమాధానమివ్వవలెను. వారి మాటలను రద్దు చేయుచు నిదర్శనములతో విసిరివేయవలెను. కాని మన ముఅల్లిమీన్లు, ముబల్లిఘీన్లు, మురబ్బీలు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అవతరణ ఉద్ధేశమును అర్థము చేసుకొని తమ ఆధ్యాత్మిక స్థితిలో అభివృద్ధి చెందుచు ప్రతి ఒక్కరి ఉనికి స్వయముగా ఒక సంకేతమగుట అంతకన్నా ముఖ్యము, అనివార్యమైనది. ఇందుకు ప్రయత్నించవలెను. ఈ ఉదాహరణనే చూచి

ప్రజలు జమాఅత్‌లోకి ప్రవేశింతురు. ఈ ప్రమాణము ఇంత వరకు ఏర్పడలేదని ఇక్కడ నేను విచారముతో చెప్పుచున్నాను. అందుకే భారత దేశములో అనేక ముఅల్లిమీన్లను తొలగించవలసి వచ్చినది. కొందరిపై ప్రాపంచిక కోరిక విజయము పొందినదని అనిపించెను. ఈ ఉత్తరము వ్రాయువారు కూడ, మనలోని ప్రతి ఒక్కరు కూడ తమ బాధ్యతలు ఏమిటి? అని పరిశీలించుకోవలెను. హృదయములలో విశ్వాసము కలిగించుటకు ముఅల్లిమీన్లు, ముబల్లిఘీన్లు ఎంత కృషి చేసినారో చూడవలెను. పసలేని నిదర్శనములతో ప్రజల హృదయములను ప్రభావితము చేయుటకు, అహ్మదియేతర మౌల్వీలను పరుగెత్తించడముతోనే సరిపెట్టుకోకూడదు. ఇంతటితోనే సంతోషపడకూడదు. మన వద్ద యున్న అల్లాహ్ సంకేతములు, మహిమలతో దైవ ఉనికిని ప్రపంచమునకు చూపవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంతో నున్న క్రియాత్మక సాక్ష్యముతో ప్రజల హృదయములను అంగీకరించేటట్లు చేయవలెను.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఒక ఉదాహరణ ఇచ్చిరి. సూర్యుడు ఉదయించిన తర్వాత సూర్యుడు ఉదయించినట్లు నీ వద్ద ఏ నిదర్శమున్నదని ఒకడు అన్నచో మరొకడు ఇంత సమయమున సూర్యుడు ఉదయించును, ఇన్ని గంటలకు సూర్యుడు అస్తమించునని విజ్ఞాన శాస్త్రము తెలుపునని నిదర్శనములివ్వడం మొదలు పెట్టును.

ఈ విధముగా నిదర్శనములు ఇవ్వసాగిన వ్యక్తి కూడ అవివేకి అగును. ఇందుకు సాధారణ చికిత్స ఏమనగా సూర్యుని నిదర్శనము అడిగే వాని గడ్డము క్రింద చెయ్యి పెట్టి అతని ముఖము పైకి లేపి అదిగో సూర్యుడని చెప్పినచో సరి పోవును. నిదర్శనములు ఇవ్వవలసిన అవసరం లేదు. మీ

అవివేకమైన మాటలకు ఇప్పుడు సూర్యుడే సమాధానము.

కనుక సూర్యుని ఉనికికి నిదర్శనములిచ్చే అవివేకి వలె అయ్యే బదులు ఉపదేశకులు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ద్వారా ప్రత్యక్ష్యమయ్యే తాజా సంకేతములు, అనుక్షణం మనతో నున్న అల్లాహ్ క్రియాశీల సాక్ష్యము ద్వారా ఈ సత్యమును నిరూపించవలెను. కాని తమ స్థితులను కూడ అల్లాహ్ ప్రీతికి అనుగుణంగా చేసుకోవలెను. జమాఅత్ ఆచరణ శక్తిని దృఢపరుచుము. జమాఅత్ పిల్లల, స్త్రీల, పురుషుల ముందు ఈ విషయములను ప్రవేశపెట్టుము. నేను చెప్పినట్లు పదే పదే ప్రవేశపెట్టుము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ద్వారా అల్లాహ్ వైభవము ఏ విధముగా బహిర్గతమైనదో వారికి తెలుపుము. అల్లాహ్ సామీప్యము పొందు మార్గములేమిటో, అల్లాహ్ ప్రేమ ఏ విధముగా పొందవచ్చును? వారికి సూచించుము. అప్పుడు ప్రాపంచిక సమస్యలలో నకలు చేయు స్వభావము కలిగిన నవయువకులు అల్లాహ్ వైపు మోకరిల్లునట్లు చూడవచ్చును. తద్వారా కేవలము పలువురు మురబ్బీలు లేదా పండితులు మాత్రమే జమాఅతేతర మౌల్వీలను ఘోరముగా ఓడించరు, మన నవయువకులు, పురుషులు, స్త్రీలు, పిల్లలు ఇటువంటి ఉదాహరణలను నెలకొల్పెదరు. వీరు ప్రపంచమును తమ వైపు ఆకర్షించు వారగుదురు. కనుక ముందుగా తమ ఆచరణీయ స్థితులను చక్కదిద్దుకొను పని వైపు దృష్టి సారించవలసిన అవసరమున్నది.

తమను తాము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో జోడించి ఖిలాఫత్‌తో సంపూర్ణ విధేయత వహించవలసిన అత్యవసరము గలదు. ఈ విషయమే జమాఅత్‌లో దృఢత్వము, ఆధ్యాత్మికతలో ప్రగతి చెందుట. ఖిలాఫత్

నిజమైన అవగాహన, అర్థమును కలిగించుట కూడ శిక్షకుల కార్యములలో ఒక ముఖ్య కార్యము. పదవీదారులు కూడ ఇటు వైపు ప్రత్యేక శ్రద్ధ వహించవలెను. కొన్ని ఉదాహరణలు ఇటువంటివి కూడ జరుగును. అనగా వర్తమాన ఖలీఫా ఈ తప్పుడు పని చేసినాడు, ఈ తప్పుడు నిర్ణయము తీసుకున్నాడు. లేదా ఈ నిర్ణయము ఇట్లుండవలెను, న్యాయస్థానముపై కొన్ని విమర్శలు జరుగును, లేదా ఫలానా వ్యక్తిని ఎందుకు నియమించిరి ? అక్కడ ఫలానా నియమించబడవలెను. వర్తమాన ఖలీఫాకు ఫలానా, ఫలానా గురించి అధిక అవగాహన, పరిచయమున్నది. ఫలానా వ్యక్తి గురించి అవగాహన యున్నా కనులు మూసుకున్నారు. ఇటువంటి మాటలు మాట్లాడే వారు కొందరే వున్నారు. కాని సమాజమును చెడగొట్టుదురు. నేనింతకు ముందు చెప్పినట్లు ప్రతి స్థాయి పదవీదారులు, శిక్షకులు ఉపశాఖ హెూదాదారులు తమ తమ బాధ్యతను అర్థము చేసకొనినచో కొందరి హృదయాలలో ఏర్పడే అనుమానములు, సందేహాలు ఎన్నడు ఏర్పడవు. వ్యవస్థలోనే శుభములన్ని గలవని బోధించుట శిక్షకుల కర్తవ్యము. అల్లాహ్ ఒక జాతిని శాపించదలచి నప్పుడు వ్యవస్థను అంతము చేయును. ఈ విషయములన్ని తెలిసినచో మోసపోయేవారు కొందరు మోసపోకుండా రక్షించబడుదురు. తమను తాము సర్వ వివేకులని భావించే వారు కొందరైనను, ఇటువంటి వర్గము ఎల్లప్పుడుండును. ఖలీఫా దేవుడు కాదు, సాధారణ వ్యక్తి పొరపాటు చేసినట్లు అతడు కూడ పొరపాటు చేయవచ్చునని అక్కడ, ఇక్కడ కూర్చొని మాట్లాడుకొందురు. సరే. కాని దీనికి హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని చాలా మంచి సమాధానమిచ్చిరి. ఖిలాఫత్ సత్యమైనచో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని ఈ సమాధానము ప్రతి సమయము, కాలము కొరకు గలదు. అల్లాహ్ తరపున ఈ కానుక ప్రసాదించబడినదని ఖిలాఫత్ మీద

విశ్వాసమున్నచో అల్లాహ్ ఇట్లు నుడివెను. ప్రపంచములో ఖలీఫాలు తీర్మానము చేసిన విషయములను మేము కొనసాగింతుము. అతడిట్లు నుడివెను. وَلَيُمَكِّنَنَّ لَهُمْ دِيْنَهُمُ الَّذِى ارْتَضٰى لَهُمْ అనగా ఖలీఫాలు ప్రపంచములో ఏర్పరదలచిన నియమములు, ధర్మమును మేము ప్రపంచములో కొనసాగించి తీరుదుమని మా ఉనికి ప్రమాణముగా మేము చెప్పుచున్నాము.

ఈ విషయములు జమాఅత్‌లోని ప్రతి సభ్యుని హృదయములో గట్టిగా పాతుకుపోవలెను. దీనిని ప్రతి ఒక్కరి హృదయములో కల్పించుటకు కృషి చేయుట మురబ్బీల, విద్యావంతుల విధి. కనుక ఈ బాధ్యతను గ్రహించుము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అనుగ్రహములు, శుభములను ప్రజలకు తెలుపుటకు కంకణం కట్టుకొనుము. అల్లాహ్ సజీవ సంకేతములను పదే పదే ప్రస్తావించవలెను. అల్లాహ్ సామీప్యమును పొందుటకు ఏ మార్గములు గలవు ? ప్రతి స్థితిలో వర్తమాన ఖలీఫా విధేయత, వ్యవస్థ విధేయత ప్రాముఖ్యత ఏమిటో ప్రజలకు తెలుపవలెను.

ఇలా సంభవించినప్పుడు హృదయముల అనుమానములు కూడ దూరమగును. ఈ పద్ధతిలో అనుమానములను దూరము చేయువారి సంఖ్య, లేదా అనుమానములు దూరమైన హృదయముల సంఖ్య ఎంత అధికమైనచో ప్రతి మోసము తనంతట తానే మృతి చెందును. జమాఅత్‌లోని అన్ని రకాలుగా ఆచరణ సవరణ ప్రతి కోణమున దర్శనమిచ్చును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అవతరణ గొప్ప ఉద్దేశమిదే. ప్రవక్తుత్వ ముద్ర, మసీహ్ మరణము వంటి సమస్యలను తెలుసుకొను అవసరము మనకు గలదు. వ్యతిరేకులకు సమాధానమివ్వడానికి ఇది అవసరము. కాని

ఆచరణ, విజ్ఞానమును మన జమాఅత్‌లో కొనసాగించుటకు ఒక ప్రయత్నము అవసరము. బయటి సరిహద్దుపై ఎంత శ్రద్ధ మనము వహించవలెనో అంత కంటే ఎక్కువ శ్రద్ధ మన అంతర్గత సరిహద్దుపై కూడ పెట్ట వలెను. ఈ ప్రచారము కంటే మన ఆధ్యాత్మిక పవిత్రత, మన ఆచరణ సవరణ పెద్ద విప్లవము సృష్టించుటకు కారణమగును. ఇన్షాఅల్లాహ్.

## విద్యావంతులు, శిక్షకులు హృదయములను సవరించుకొనుము

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఈ ఉపదేశము చాలా ముఖ్యమైనది. వారు అనగా విద్యావంతులు, శిక్షకులు హృదయాలను సవరించినచో, ప్రజల హృదయములో జ్ఞానము, అల్లాహ్ ప్రేమను కలిగించినచో కోట్లాను కోట్లాది ప్రజలు అహ్మదియ్య సంస్థలో ప్రవేశింతురు. స్వయాన అల్లాహ్ ఇట్లు నుడివెను.

إِذَا جَاءَ نَصْرُ اللَّهِ وَالْفَتْحُ ۔ وَرَأَيْتَ النَّاسَ يَدْخُلُونَ فِي دِينِ اللَّهِ أَفْوَاجًا ۔ فَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ وَاسْتَغْفِرْهُ إِنَّهُ كَانَ تَوَّابًا ۔

(అల్ నస్ర్) అనగా ప్రచారము ద్వారా మీరు మీ ధర్మమును వ్యాపింపజేసినచో ఒక్కొక్కరు, ఇద్దరిద్దరు మీ వైపు వత్తురు. కాని మీరు ఇస్తిఘ్ఫార్, తస్బీహ్ చేసినచో, తమలో నుండి పాపములను దూరము చేసుకున్నచో గుంపులు గుంపులుగా ప్రజలు వచ్చి, మీలో ప్రవేశింతురు.

ఇతరులను ఘోరంగా ఓడింతుమని నాకు మన విద్యావేత్తలు వ్రాయుదురు. ఆచరణ సవరణతో లభించే ఉద్దేశము ఈ ఓడించడంతో లభించదు. కనుక ఆచరణ సవరణ వైపు దృష్టి సారించుము. ఖలీఫాకు సహకరించుటకు ప్రయత్నించుము. వర్తమాన ఖలీఫాకు సహాయకులగుటకు ప్రయత్నించుము. సంవత్సరమంతా మనము కేవలము విద్యా సమస్యలలోనే

వుండి పోకూడదు. జమాఅత్‌ను మనము ప్రగతి వైపు తీసుకెళ్లదలచినచో ఇన్షాఅల్లాహ్ తీసుకెళ్లెదము, మనము ఇతర మార్గములను అవలంభించ వలెను. నేను చెప్పినట్లు అది ఆచరణ సవరణయే. మనము మన కర్మలను చక్కదిద్దవలసిన అవసరమున్నది. మన నీతి నిజాయితి ప్రమాణములను పై స్థాయికి చేర్చవలసిన అవసరమున్నది. మనము మన ధర్మబద్ధ ఆదాయ మార్గములను అవలంభించవలసిన అవసరమున్నది.

## అతి గొప్ప ఆయుధము ప్రార్థన (దుఆ)

మురబ్బీలు ఇటువైపు శ్రద్ధ వహించవలసిన అవసరమున్నట్లే జమాఅత్ ప్రతి సభ్యుడు తమ ఆత్మ పరిశీలన చేసుకొని సంస్కరించు కోవలసిన అవసరమున్నది. దీనికి తోడుగా అన్నిటి కంటే పెద్ద ఆయుధము దుఆ. సదా దీనిని మనము మన దృష్టిలో వుంచుకొను అవసరము గలదు. దీని సరియైన ఉపయోగము, దీనితో సరియైన రీతిలో లబ్ది పొందుటకు అల్లాహ్ ఈ ఆదేశమును గుర్తుంచుకోవలెను. విశ్వాసములో ప్రగతి పొందుము. సత్కార్యములు చేయు ఏ ప్రణాళికను నేను విధించినానో దానిని ఆచరించుము. కనుక ఈ ఆచరణ, ఈ దుఆ, అమలు ఒక దాని వెంట ఒకటి కొనసాగినప్పుడే నిజమైన సవరణ సాధ్యమగును. అల్లాహ్ మనందరికి దీని భాగ్యము కలిగించుగాక!

❖

# ⑨

# ఖుత్బా జుమా సారాంశము : 7 ఫిబ్రవరి 2014

## ఆచరణ సవరణ గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఉపదేశములు

ఆచరణ సవరణ గురించి హుజూర్ అఖ్దస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ తమ విశ్వాసపూరిత ఖుత్బా జుమాలో హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజియల్లాహు అన్హు గారి ఒక కథనము, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పలు పంక్తులను ప్రవేశపెట్టిరి. వాటిని క్రింద ప్రచురించుచున్నాము. హుజూర్ అయ్యదహుల్లాహు తఆలా ఇట్లనిరి.

అహ్మదియ్య జమాఅత్‌పై అల్లాహ్ దయ ఇట్లు కూడ గలదు. అనగా వర్తమాన ఖలీఫా ద్వారా ఏదేని విషయము వైపు దృష్టి సారించబడినప్పుడు అది, సవరణ కోణములో నున్నచో జమాఅత్‌లోని ఒక పెద్ద భాగము సవరణ వైపు దృషి సారించును. ఉత్తరముల ద్వారా నాకీ అంచనా కలుగుతుంది. ఖిలాఫత్‌నకు అల్లాహ్ కొందరు సహాయకులను అందించినాడు. తమకు జ్ఞాపకమున్న మేరకు వారు కొన్ని పంక్తులను తీసి పంపుదురు. గతములో ఈ పంక్తులను చదివినను సమయమున జ్ఞాపకమునకు రావు. జీవిత చరిత్రకు చెందిన ఈ పంక్తిని నేను చదివెదను. ఇందులో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం తమ కలతను వ్యక్తపరచిరి. మన ఒక మురబ్బి గారు దీనిని పంపిరి. మీరు ఖుత్బాలలో ఆచరణ సవరణ ప్రాముఖ్యతను

తెలుపుచున్నారు. ఈ పంక్తిలో కూడ హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇదే వ్యాకులతను వ్యక్తపరచిరి. అల్లాహ్ వారికి కూడ ప్రతిఫలమివ్వుగాక! జీవిత చరిత్రలో తెలుపబడిన ఆ పంక్తి ఇట్లు గలదు. హ్రజత్ మిర్జా బషీర్ అహ్మద్ రజియల్లాహు అన్హు ఇట్లు తెలిపిరి.

మౌల్వీ ముహమ్మద్ సర్వర్ షాహ్ గారు నాకిట్లు తెలిపిరి. ఒక సారి ఏదేని ఒక పని గురించి మీర్ గారు అనగా మీర్ నాసిర్ నవాబ్ గారికి మౌల్వీ ముహమ్మద్ అలీ గారితో విభేదము ఏర్పడెను. ఈ విధముగా విభేదము ఏర్పడినదని కోపమును ప్రదర్శించుచు మీర్ గారు లోనికి వెళ్లి హ్రజత్ గారికి విషయము తెలిపిరి. మౌల్వీ ముహమ్మద్ అలీ గారికి ఈ విషయము తెలియగా హ్రజత్ గారు అనగా హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంతో ఇట్లు వేడుకొనిరి. హుజూర్ సన్నిధిలో యుండినచో ఏదేని ధార్మిక సేవకు అవకాశము లభించునని మేమిక్కడికి హుజూర్ గారి కొరకు వచ్చినాము. కాని హుజూర్ వద్దకు మా గురించి ఫిర్యాదులు ఈ విధముగా అందినచో హుజూర్ కూడ మానవులే, ఖాదియాన్ వచ్చినందుకు మాకు ప్రయోజనము కలిగే బదులు నష్టము కలుగును. బదులుగా హుజూర్ (అ) ఇట్లనిరి. మీర్ గారు నాతో ఏదో ఒకటి చెప్పినారు. కాని అప్పుడు నేను ఏదో నా వ్యాకులతలో ఎంత వరకు తలమునకలై యుంటిననగా, నేను అల్లాహ్ ప్రమాణముతో చెప్పుచున్నాను, మీర్ గారు ఏమన్నారో ఏమనలేదో నాకు తెలియదు. కొన్ని రోజుల నుండి నా మెదడులో ఒక ఆలోచన చాలా గట్టిగా కలుగుచున్నందున అది ఇతర విషయములను గమనించకుండా చేసినది. (ఇది చాలా శ్రద్ధతో వినవలసిన విషయము). అనుక్షణం నిలబడుచు, కూర్చొంటు, అదే ఆలోచన నా ముందు యుండును. నేను బయట

కూర్చొనియుండగా, ఒక వ్యక్తి నాతో మాట్లాడినను అదే ఆలోచన నా మెదడులో మెలుగుచుండును. అతని మాట నేను వింటున్నానని అతడు భావించును, కాని ఇదే ఆలోచనలో నేనుంటున్నాను. నేను గృహములోకి వెళ్లినప్పుడు కూడ అదే ఆలోచన నాతో యుండును. వాస్తవానికి ఈ రోజులలో నా మెదడులో ఒకటే ఆలోచన పదే పదే వచ్చుచున్నది. దీని వలన మరో ఆలోచన నాకు కలుగడం లేదు. ఆ ఆలోచన ఏమిటి ? అదేమనగా నా అవతరణ ముఖ్య ఉద్ధేశము ఏమిటి ? ఒక నిజమైన విశ్వాసముతో కూడిన జమాఅత్‌ను సిద్ధము చేయుట. ఆ జమాఅత్ అల్లాహ్‌ను యదార్థముగా విశ్వసించవలెను. అతనితో నిజమైన బంధమును ఏర్పరచుకొనవలెను. ఇస్లాంను ఆచరించవలెను. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శమును అనుసరించవలెను. సవరణ, నిష్టాపరతపై నడువవలెను. సద్గుణముల గొప్ప ఉదాహరణను నెలకొల్పవలెను. ఫలితముగా ఇటువంటి జమాఅత్ ద్వారా మరల ప్రపంచము సన్మార్గము పొంది అల్లాహ్ కోరిక పూర్తి కావలెను. ఈ ఉద్ధేశము పూర్తి కాక, సాక్ష్యములు, నిదర్శనములతో మనము శత్రువుపై విజయము సాధించి, అతన్ని పూర్తిగా వశపరచుకున్నను అనగా విజయము సాధించినా మన విజయము అర్థరహితమగును. ఎందుకనగా మా అవతరణ అసలు ఉద్ధేశము పూర్తి కానిచో మా కార్యమంతయు వృధా అయ్యెను. సాక్ష్యములు, నిదర్శనములలో విజయపు స్పష్టమైన సంకేతములు బహిర్గతమగుచున్నవి, శత్రువు కూడ తన బలహీనతను తెలుసుకున్నాడు, కాని మా అవతరణ అసలు ఉద్ధేశము గురించి ఇంకా జమాఅత్‌లో చాలా లోపమున్నది. చాలా శ్రద్ధ అవసరము. ఇదే ఆలోచన నన్ను ఈ రోజులలో బాధకు గురి చేయుచున్నది. ఇది ఎంతగా

నన్ను ఆవహించినదనగా ఏ సమయమున నన్ను వీడడం లేదు.

ఈ కలత వారిని వ్యాకులతకు గురి చేసెను. అహ్మదీ ఎలా యుండవలెనో వారు వివిధ సమయములలో జమాఅత్‌నకు ఉపదేశములు చేసినారు. ఇతర పుస్తకములు కాక పది సంపుటిలలో వారి ఉపదేశములు (మల్ఫూజాత్) గలవు. ఇవి వారి సమావేశముల వివరముతో కాక సంక్షిప్త నివేదికలు. అయినను పది సంపుటిలలో ఏ సంపుటిని తీసుకున్నా అందులో జమాఅత్‌నకు ఉపదేశములు, ఆచరణ స్థితుల మార్పు అంశము వివిధ పద్ధతులలో, వివిధ రకాలలో ప్రతి చోట, ప్రతి సమావేశములో వారు ప్రస్తావించిరి. వాటిలోని కొన్నిటిని ఇప్పుడు ఇక్కడ ప్రస్తావింతును. వారొక చోట ఇట్లు ఉపదేశించిరి.

పరస్పరము ఐక్యముగా యుండుచు, కలిసి మెలిసి యుండుమని పరస్పర ఐక్యత, ప్రేమ గురించి ఇంతకు ముందు నేను అనేక సార్లు చెప్పియున్నాను. ఒక్క ఉనికిగా యుండుము లేనిచో గాలి (శక్తి) పోవునని అల్లాహ్ ముస్లిములకు బోధించియున్నాడు. పరస్పరము ఐక్యతగా యుండుటకు నమాజ్‌లో ఒకరు మరొకరు కలిసి యుండవలెనను ఆజ్ఞ గలదు. విద్యుత్తు శక్తి వలె ఒకరి మంచి మరొకరిలో ప్రవహించును. విభేదమున్నచో, ఐక్యత లేనిచో సర్వము కోల్పోవుదురు. పరస్పరము ప్రేమించుకొని, పరోక్షముగా దుఆ చేయగలరని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిరి. (ఒకరు మరొకరి కొరకు పరక్షోముగా దుఆ చేయువారు ఎందరున్నారని మనము పరిశీలించుకోవలసిన అవసరముంది.) ఒక వ్యక్తి పరోక్షముగా దుఆ చేసినచో నీ కొరకు కూడ అటులనే జరుగవలెనని దేవదూత అనును. మానవుని దుఆ ఆమోదించబడనిచో దేవదూత దుఆ

మాత్రం ఆమోదించబడును. పరస్పరము విభేదము వుండకూడదని నేను బోధించదలచితిని.

నేను రెండు సమస్యలనే తీసుకొని వచ్చినాను. ఒకటి అల్లాహ్ ఏకత్వమును పాటించుము. రెండవది పరస్పరము ప్రేమ, సానుభూతిని వ్యక్తపరచుము. ఇతరులకు అద్భుతముగా కనిపించు ఆదర్శమును ప్రదర్శింపుము. ఇదే నిదర్శనము అనుచరులలో యుండెడిది. كُنتُمْ أَعْدَاءً فَأَلَّفَ بَيْنَ قُلُوبِكُمْ (ఆలె ఇమ్రాన్ : 104) అనగా మీరు పరస్పరము శత్రువులుగా నున్నప్పుడు అతడు మీ హృదయములను ప్రేమతో ఏకమొనర్చెను. ప్రేమ ఒక మహిమ అని గుర్తుంచుకొనుము. మీలో ప్రతి ఒక్కరు తనకు కోరునదే తన సోదరుని కొరకు కోరువారగునంత వరకు అతడు నా జమాఅత్‌లో లేడని గుర్తుంచుకొనుము. అతడొక ఆపద, బాధ. అతని అంతము మంచిగా లేదు.

మరల వారిట్లనిరి.

ప్రకోపము దూరమగుట మహ్దీ లక్షణము. ఆ లక్షణము పూర్తి కాదా! అది తప్పక పూర్తి అగును. మీరెందుకు సహనము పాటించరు. కొన్ని విషయములు మరి కొన్ని వ్యాధులలో అంతము చేయనంత వరకు వ్యాధి దూరము కాదని వైద్య సమస్యలో గలదు. నా ఉనికితో ఒక సత్‌సమాజము ఏర్పడును. ఇన్షాఅల్లాహ్. పరస్పర శత్రుత్వమునకు కారణమేమిటి. లోభితనము, అహంకారము, గర్వము, మనోభావములు. తమ భావాలను అదుపులో వుంచుకొనని, పరస్పరము ప్రేమ, సోదర భావముతో యుండని వంటి వారందరిని జమాఅత్ నుండి దూరము చేయుదును. ఉత్తమ ఆదర్శమును చూపనంత వరకు ఈ విధముగా యున్న వారు కొన్ని రోజుల

అతిథులని గుర్తుంచుకొనుము. ఒకరి వలన నేను నాపై అపనిందను మోయదలచ లేదు. నా జమాఅత్‌లో యుండి నా అభీష్టము మేరకు యుండని వ్యక్తి ఒక ఎండిపోయిన శాఖ వంటి వ్యక్తి. తోటమాలి దానిని కొట్టి వేయక ఏమి చేయును. ఎండిన శాఖ ఇతర శాఖతో యుండి నీరు పీల్చును, కాని అది దానిని సశ్యశ్యామలము చేయలేదు. అంతే గాక ఆ శాఖ మరొక దానిని కూడ వృధా చేయును. తనను తాను చికిత్స చేయని వాడు నాతో వుండలేదని భయపడుము.

ఈ పంక్తిని ఇంతకు ముందు కూడ మనము అనేక సార్లు వినెదము, చదివెదము. కాని వారు బాధను వ్యక్తపరచి, ఆచరణ సవరణ కావలెనని చాలా రోజుల నుండి నాకు ప్రశాంతత వుండడం లేదని తెలిపిన పంక్తితో కలిపి చూసినచో ఒక ప్రత్యేక కలత కలుగును.

ఒక వ్యక్తి ఎప్పుడు నిజమైన విశ్వాసి అనబడును ? తెలుపుచు వారిట్లనిరి.

ప్రతి విషయములో అల్లాహ్‌కు ప్రాధాన్యత కలుగనంత వరకు, హృదయమును పరిశీలించుకొని అతడు నా వాడే అని అనిపించ నంత వరకు అతడు నిజమైన విశ్వాసి అనబడడు. اَسْلَمَ وَجْهَهٗ لِلّٰهِ ప్రకారము యున్నవాడే ముస్లిం అగును. నోటిని وَجْهَهٗ అందురు. కాని ఇది ఉనికి, అస్థిత్వము కొరకు కూడ అనబడును. సర్వ శక్తులను అల్లాహ్ ఆస్థానములో పెట్టిన వ్యక్తి నిజమైన ముస్లిం అనబడుటకు అర్హుడు. నా కొకటి గుర్తుకొచ్చినది. నీవు ముస్లిం అగుమని ఒక ముస్లిం ఒక యూదునికి ఇస్లాం ఆహ్వానము అందించెను. (ఇస్లాం ఆహ్వానము అందించు వ్యక్తి ముస్లింగా యుండెను) స్వయముగా పాపములు, నేరములకు పాల్పడేవాడు. ఆ దుష్టుడైన ముస్లింతో

యూదుడు ఇట్లనెను. నీవు ముస్లిం అయినందుకు గర్వపడకు, తనను తాను పరిశీలించుకొనుము. పేరు, పదమును కాక ఇస్లాం భావమును అల్లాహ్ కోరును.

మరల వారిట్లనిరి.

ఆచరణ లేనంత వరకు నోటి మాటలు, మూటలు పనికిరావు. కేవలము మాటలకు అల్లాహ్ వద్ద ఎలాంటి ప్రాముఖ్యత లేదు. వైభవోపేతుడైన అల్లాహ్ ఇట్లనెను. كَبُرَ مَقْتًا عِندَ اللَّهِ أَن تَقُولُوا مَا لَا تَفْعَلُونَ (అల్‌సఫ్:4 – అనగా మీరు చేయని దానిని అనుట అల్లాహ్ దృష్టిలో చాలా పెద్ద పాపము.) మరల ఇట్లనిరి. మీరు ఇస్లాం సేవ చేయదలచినచో మొదట మీరు దైవభీతి, పవిత్రతను అవలంభించుము. صَابِرُوا وَرَابِطُوا (అనగా సహనము వహించుము, సహనము వహించుటకు బోధించుము) ఇది పవిత్ర ఖుర్‌ఆన్‌లోని ఆలె ఇమ్రాన్ అధ్యాయపు సూక్తి.

శత్రువు హద్దులు దాటకుండా శత్రువు సరిహద్దున అశ్వము (రక్షణ) యుండుట అనివార్యము. శత్రువు హద్దులు దాటి ఇస్లాంనకు నష్టము కలిగించకుండా అటులనే మీరు కూడ సంసిద్ధులగుము. మీరు ఇస్లాం సేవ చేయదలచినచో మొదట మీరు దైవభీతి, పవిత్రతను అవలంభించుము, తద్వారా మీరు స్వయముగా అల్లాహ్ సురక్షిత కోటలోకి చేరుదురని నేను అనేక సార్లు చెప్పినాను. అనంతరం మీకు దాని సేవ గౌరవము, హక్కు లభించును. ముస్లిముల బాహ్య శక్తి ఎంత బలహీనమైనదో మీరు చూచుచున్నారు. వారిని జాతులు ద్వేషము, అవహేళనతో చూచుచున్నాయి. (ఈ పరిస్థితి గతము కంటే దిగజారినట్లు మనము నేడు చూచుచున్నాము) కనుక మీ అంతర్గత, హృదయ శక్తి కూడ బలహీనమై, దిగజారినచో ఇక

అంతమే అంతమని భావించుము. పవిత్ర శక్తి పరుగెత్తునట్లు, సరిహద్దులోని అశ్వముల వలె గట్టి రక్షకులుగా అగుటకు మీ మనసులను పవిత్ర పరచుకొనుము. అల్లాహ్ కృప సదా నిష్టాపరులు, సత్యవంతులతోనే యుండును. ఇస్లాం అపనిందకు గురయ్యే విధముగా తమ ప్రవర్తనలు, అలవాట్లను చేసుకోకుము. దుష్కార్యులు, ఇస్లాం బోధనను ఆచరించని వారిచే ఇస్లాం అపనిందకు గురియగును. ఒక ముస్లిం మద్యము సేవించి ఎక్కడెక్కడో వాంతులు చేసుకొంటూ సంహరించును. తల రూమాలు మెడలో పడును. మోరీలు, మలిన కాలువలలో పడి తిరుగుచుండును. పోలీసుల బూట్లు పడును. హిందువు, క్రైస్తవులు అతనిపై హాస్యించును. శాసనమునకు విరుద్ధమైన అతని ఈ కార్యము అతని అవమానమునకు కారణమే కాక ఇస్లాంనకు కూడ అవమానము కలిగించును. ఇటువంటి వార్తలు లేదా కారాగార నివేదికలు చదివి నాకు చాలా దుఃఖము కలుగును. ముస్లిములు దురాచారములలో ఇంత వరకు దిగజారినందున శిక్షకు గురైనారని, సత్పథము కలిగి తమ హద్దులు మీరిన ప్రవర్తనముల వలన తమకు తాము నష్టము కలిగించుకొనుటయే కాక ఇస్లాం అవమానమునకు కారకులైనట్లు చూచి నా హృదయము ఎంతో వ్యాకులత చెందును.

దీనితో నా ఉద్దేశవేమనగా ముస్లిములనబడి నిషేధిత, నివారించబడిన కార్యములలో పడి తమను తామే కాక ఇస్లాంను కూడ సందేహములో పడవేయుచున్నారు. తిరస్కృతులకు కూడ మిమ్ములను, వాస్తవానికి ఇస్లాంను ఆరోపించే అవకాశము లభించకుండా మీ వ్యవహారమును, పద్ధతులను మార్చుకొనుము.

ఈ ప్రమాణమును పొందుటకు మనమందరము ప్రయత్నించ

వలసిన అవసరమున్నది.. ప్రయత్నించవలెను కూడ. దైవభీతిని అవలంభించుట, తమ కర్మలను సవరించుకొనుట, తమ విశ్వాస ప్రమాణమును పెంచుకొనుట, ఈ విషయములు ఏదో సాధారణ విషయములు కావు. మనము వర్తమాన కాలపు ఇమామ్‌ను విశ్వసించి నందున వారి ఆశయముల మేరకు పూర్తిగా మారుటకు మనము సంపూర్ణ ప్రయత్నము, కృషి చేయవలెను. ప్రతి చిన్న చిన్న సత్కార్యమును కూడ చేయుటకు మనము ప్రయత్నించవలెను. ప్రతి దుష్కార్యముతో మనము పూర్తిగా ద్వేషమును వ్యక్తపరచవలెను. మనము ప్రేమ, అనురాగము, సోదరాభావమును పెంచే అవసరము గలదు. ఒకరు మరొకరి సహాయకులగు అవసరమున్నది. అప్పుడు మనము మన బైఅత్ (ప్రతిజ్ఞ) హక్కు చెల్లించువారమగుదుము. ఇందుకు అల్లాహ్ మనందరిని అనుగ్రహించుగాక! (ఆమీన్).

❖❖❖❖❖

❖❖❖